

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక


సంపుటి :14  సంచిక: 01  హైదరాబాద్      2014   మే    పేజీలు 40

Please visit :  www.srimeherbaba.com      వార్షిక సభ్యత్వం : రూ.100/-

## కామారెడ్డి బాబా సెంటర్ 21వ వార్షికోత్సవము

అవతార్ మెహెర్‌బాబా కామారెడ్డి సెంటర్ 21వ వార్షికోత్సవం సందర్భంగా బాబా ప్రేమిక సహవాస్ 1.05.2014 నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## నూతన బాబా సెంటర్

నిజామాబాద్ జిల్లా, మాక్లూర్ మండలంలోని **కృష్ణానగర్ క్యాంప్‌లో** అవతార్ మెహెర్‌బాబా నూతన బాబా సెంటర్‌ను 25.05.2014న శ్రీ బి.రామక్రిష్ణయ్య ప్రారంభిస్తున్నట్లు శ్రీ జనార్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బాబా ప్రేమిక సహవాస్ ఉ. 7 నుండి సా. 5 దాకా ఏర్పాటు చేసినట్లు శ్రీ జనార్ధనరావు (9908785774) తెలిపారు.

## సిరిసిల్ల బాబా సెంటర్ 31వ వార్షికోత్సవం

కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల బాబా సెంటర్ 31వ వార్షికోత్సవాన్ని 2014 జూన్ 7 శనివారం ఉ. 7 నుండి రాత్రి 9 గంటల దాకా నిర్వహిస్తున్నట్లు శ్రీ డి. ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమాలకు మెహెరాబాద్ నుండి శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ, శ్రీ బి.రామక్రిష్ణయ్య, శ్రీ ఎస్.వి.ప్రసాద్‌రాజు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారు. అలాగే, తెట్టెకుంట బాబా సెంటర్ 12వ వార్షికోత్సవం 2014 జూన్ 8, ఆదివారం ఉ. 7 నుండి సా. 5 దాకా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## రాజాం బాబా సెంటర్

రాజాం బాబా సెంటర్‌లో **ఆచరణాత్మక ఆధ్యాత్మిక శిక్షణా కార్యక్రమం** ప్రతి ఆదివారం ఉదయం 10 నుండి 5 దాకా నిర్వహిస్తున్నట్లు శ్రీ పి.వి.రమణమూర్తి, కార్యదర్శి (9440887731) ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ డి. శ్రీనివాసరావు, శ్రీకాకుళం అవతారుని సందేశాలపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. ఆసక్తిగల ఆధ్యాత్మిక జిజ్ఞాసులందరూ పాల్గొనవల్సిందిగా శ్రీ రమణమూర్తి స్వాగతం పలుకుతున్నారు.

## తాడేపల్లిగూడెం బాబా సెంటర్

అవతార్ మెహెర్‌బాబా తాడేపల్లిగూడెం, సుబ్బారావుపేట సెంటర్ నూతన కార్యనిర్వాహక సభ్యుల ఎంపిక 2014 ఏప్రిల్ 6న జరిగింది. **అధ్యక్షులు:** శ్రీ బి. రామరాజు, **ఉపాధ్యక్షులు:** శ్రీ జి. శేషగిరిరావు, **గౌరవ సలహాదారు:** శ్రీ జి. లక్ష్మీనారాయణ, రిటైర్డ్ లెక్చెరర్, **కార్యదర్శి:** డా॥ ఏ. హరిశ్రీనివాస్, **సంయుక్త కార్యదర్శులు:** శ్రీమతి డి. రమ, శ్రీ జి. శ్రీనివాసరావు, శ్రీ పి. బసవన్న, **కోశాధికారి:** శ్రీ పి.వి రావు, **కమిటీ సభ్యులు:** శ్రీ కె. వీరనాయుడు, శ్రీ బి. రామాంజనేయులు, శ్రీమతి బి. గోవిందమ్మ, శ్రీమతి టి. రమణి, శ్రీ జి. సాంబశివరావు, శ్రీ సిహెచ్. మంగరాజు.

## బాబా సందేశం

ఎవరైతే నా ప్రేమ సందేశ వ్యాప్తిలో పాల్గొంటారో, అది ఆయా వ్యక్తుల ఆధ్యాత్మిక ఉన్నతికి దోహదపడుతుంది.

Whoever works for me works for his ownself.

**- MEHER BABA**


**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**


## లోపలి పేజీలలో...


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | గుజరాతీ సహవాస్ | 6-11 |
| 3. | పూనే సెంటర్ పసిడి పండుగ వేడుకలు | 12-13 |
| 4. | అర్ధ శతాబ్దిలో - మైలురాళ్ళు | 14-16 |
| 5. | బాబా సాధ్రా | 17 |
| 6. | జూలై 10 - మౌన దినం | 18 |
| 7. | మా మాటలు | 19 |
| 8. | లార్డ్ మెహెర్ | 20-27 |
| 9. | వెంకోబరావు | 28-39 |



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# బెంగళూరులో సహవాస్

## 2014 జూన్ 14,15 తేదీలలో

బెంగళూరులోని జయానగర్‌లో అవతార్ మెహెర్‌బాబా సెంటర్‌లో ప్రత్యేక సహవాస్ కార్యక్రమం 2014 జూన్ 14,15 తేదీలలో ఏర్పాటు చేసినట్లు శ్రీ ఎ. రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సెంటర్ ప్రాంగణంలో మెహెర్‌బాబా వారి పాలరాతి విగ్రహ ప్రతిష్ట ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నారు. అవతారుని నిలువెత్తు పాలరాతి విగ్రహాన్ని రాజస్థాన్‌లోని జైపూర్‌లో రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా శ్రీ రాజగోపాల్ కోరుతూ, తగిన ఏర్పాట్లు చేసుకునేందుకు వీలుగా హాజరుకాగోరు బాబా ప్రేమికులు తమ వివరాలు email: avatarmeherbababangalore@gmail.com, **లేదా** C/o 1186/14, 35th C Cross, 26th Main, 4th Block, Jaya Nagar, Bangalore - 41, Smt. Narmada (09980522414), Sri Rajagopal (09845697738) తెలియజేయవల్సిందిగా కోరుతున్నారు.

# పావగడ సెంటర్ రజతోత్సవం

అవతార్ మెహెర్‌బాబా పావగడ సెంటర్, తుంకూర్ జిల్లా, కర్ణాటక, రజతోత్సవ వేడుకలు 2014 జూన్ 3,4,5 తేదీలలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బాబా ప్రేమికులు 1) రఘుపతి – మెహెర్‌గడ (పావగడ) – 098804 62970, 2) ఏ.వి.జి. హరిప్రసాద్ – బెంగుళూరు – 099862 76741, email: meherd.meher77@gmail.com సంప్రదించవల్సిందిగా కోరుతున్నారు.

# జలనిధి

గత కొంత కాలంగా, అంటే 2013 అక్టోబరు మాసంలో శ్రీ వై.యస్. రావు బాబాలో ఐక్యమయినప్పటి నుండీ రెస్టు హౌస్‌కు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతిరోజు స్థానికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి సరఫరా చేస్తునట్లు, తద్వారా అధిక ఆర్థిక భారాన్ని భరించవల్సివచ్చిందని అన్నారు. ఈ ఆర్థిక లోటును పూరించవల్సిన ఆవశ్యకత ఎంతో వుందని చెబుతూ శ్రీ వై.యస్. రావు గారు ఏర్పాటు చేసిన **'జలనిధి'కి** తగిన విరాళాలు అందజేసి సహకరించవల్సిందిగా యాజమాన్యం కోరుతున్నారు. రెస్టు హౌసులో మీరు చెల్లించే లేదా అందజేసే విరాళాలకు స్థానిక మేనేజర్, ఆంధ్రా రెస్టు హౌస్ నుండి 'రశీదు' తప్పక పొందవల్సిందని అన్నారు.

# సంపాదకీయం సంపుటి 14

బాబా వారి ప్రేమ సందేశాన్ని ప్రజలందరికీ ఎలా తెలియజేస్తారు?
బాబా సెంటర్లు ఎలా నిర్వహిస్తారు?
ఈ విషయమై స్వయంగా మెహెర్‌బాబా ఏమన్నారంటే,
'నా గురించి చెప్పాల్సివచ్చినప్పుడు మీరు నా ప్రేమ సందేశానికి
ఒక ఉదాహరణగా వుండాలన్నారు'.

**బాబా తన సందేశంలో**

**1. ఎప్పుడూ సత్యం** మాత్రమే మాట్లాడాలన్నారు.
2. ఇతరులను పరోక్షంగా కూడా దూషించరాదన్నారు. 3. ఎవ్వరినీ ద్వేషించవద్దన్నారు.
4. ఎవరిపైనా శత్రుత్వం వద్దన్నారు. 5. ఎవరి మనస్సు నొప్పించేలా ప్రవర్తించొద్దన్నారు.
ఇదీ బాబా సందేశం అని నీవు ప్రజలకు చెప్పే ముందు, నీవు ఆ సందేశాలను తు.చ.
తప్పక ఆచరించిన నాడే ఇతరులెవరికైనా ధైర్యంగా చెప్పగల్గుతావన్నారు.
అప్పుడే బాబా సందేశం పట్ల ఎవరైనా ఆకర్షితులవుతారు.
ఒక వేళ నీవు ఆ మాదిరిగా ఆచరించలేనప్పుడు దయచేసి మౌనంగా వుండటమే
మేలన్నారు. నాకు తెలుసు – మీలో చాలామంది నా గురించి, నా ప్రేమ సందేశాల
గురించి అనర్గళంగా మాట్లాడగలరు. మీ వాక్చాతుర్యంతో ప్రజల్ని ఆకర్షించగలరు.
కాని, మీకు మీరుగా, నా సందేశాలను ఆచరణలో అమలు చేయలేరు.
మీరు పాటించలేని నా సందేశాలు, ఇతరులకు తెలియజేయడమనేది...
గొప్ప కపట నాటకమన్నారు బాబా.
నా నిజమైన ప్రేమికుడు ఒక్కడున్నా అతడు అనేక అద్భుతాలు చేయగల్గుతాడు.
మీరందరూ నా ప్రేమ సందేశానికి ప్రతీకలుగా ఉంటే ఈ విశ్వమంతా
ప్రేమ మయమౌతుంది. ద్వేషం, స్వార్థం కనుమరుగైపోతాయన్నారు బాబా.
సుమారుగా అర్ధ శతాబ్దం క్రితం,
1955 నవంబరులో మెహెరాబాద్‌లో నిర్వహించిన ప్రాంతీయ సహవాస్‌లో
సహవాసీలతో మాట్లాడుతూ బాబా చెప్పిన మాటలివి.
అవతారుని ఈ అమృతవాక్కులు నేటికీ ప్రాత:స్మరణీయం.

❀❀❀

నేటితో మెహెర్‌బాబా పత్రిక 14వ సంవత్సరంలో అడుగుపెట్టోంది.
పత్రిక పది వేల సైన్యంతో సమానం. ఈ శుభ తరుణంలో
క్రొత్తగా పత్రిక సభ్యత్వం తీసుకునే వారి సంఖ్యని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ
కృషి చేయాలని కోరుతున్నాం. మీ సూచనలు, సలహాలకు స్వాగతం పలుకుతున్నాం.

# గుజరాతీ సహవాస్

నవంబరు 5న ఉదయం 7.30 కల్లా బాబా మెహెరాబాద్‌కు వచ్చారు.
ప్రతిరోజూ మెహెరాబాద్‌కు వస్తూనే ముందుగా మండలి సభ్యులు పెండూ, పాద్రీ,
విష్ణు, ఛగన్, భావూలతో కొద్దిసేపు ముచ్చటించేవారు.
వారితో సహవాస్ ఏర్పాట్ల గురించి చర్చించేవారు.
ఈ సమయంలో కొందరికి చివాట్లు చిక్కేవి. ఐనాకూడా మండలి సభ్యులు
ముఖం నిండా నవ్వులు నింపుకొని తామెంతో ధన్యులం అనేలాగా ఉండేవారు.
దూరప్రాంతాల నుండి వచ్చినవారు అవతారుని ప్రేమ మధువు ఆస్వాదిస్తుంటే,
మండలి సభ్యులకు మాత్రం అవతారుని చివాట్లు లభించేవి.
ఆ ఉదయం 8.15 నిముషాలకు మండలి హాలులో బాబా సమావేశమయ్యారు.
అక్కడున్న వారందరినీ బాబా ప్రేమగా పలకరించారు.
నిన్నటిరోజున తనను ఆలింగనం చేసుకొనని వారందరినీ
ఆలింగన భాగ్యం కోసం ముందుకు రమ్మన్నారు.
బాలనాటు, డా॥ సి.డి. దేశ్‌ముఖ్‌లు రెండవసారి
బాబా ఆలింగనం కోసం క్యూలో నిలుచున్నారు.
బాలనాటుకేసి చూస్తూ, హమ్మ-దొంగా! నీవు రెండవసారి వస్తున్నావ్ అన్నారు.
డా॥ సి.డి. కేసి చూస్తూ - నేను నీకు రెండవసారి ఆలింగనం ఇవ్వనన్నారు.
నీకు కనుక రెండవసారి నా ఆలింగనం ఇస్తే,
వరుసగా అందరూ క్యూ కడతారు.
అలా అంటూ, నీ జోబులో పెన్ను వుందా? అని అడిగారు.
నిన్నటి రోజున బాబా ఆతనికి ఆలింగనం ఇచ్చే సమయంలో
డా॥ సి.డి. జోబులోంచి అతనికి తెలియకుండా
అతని కలాన్ని దొంగిలించారన్న సంగతి అందరికీ తెలిసింది.
అందరూ కడుపారా నవ్వుకున్నారు.
పాకిస్థాన్‌లోని లాహోర్‌లో వుంటున్న హోమీ దేశాయ్‌ని ఉద్దేశించి
నీవు చాలా కాలం తర్వాత మెహెరాబాద్ వచ్చావన్నారు బాబా.
బాబా సహవాస్‌లతో మాట్లాడుతూ జలుబు, రొంపతో
వున్నవారు దూరంగా కూర్చోండన్నారు.
లేదంటే మీ జలుబు నాకు అంటించే అవకాశం ఉందన్నారు.
అవతారుడివై వుండి నీకు జలుబు చేయడం ఏమిటి? అని

మీలో ఎవరైనా నన్ను అడగొచ్చు.
బాబాకు ఆకలి – విశ్రాంతి అవసరమా? అనీ అడగొచ్చు.
1932లో నేను ఇంగ్లాండు వెళ్ళిన సంగతి మీకు తెలుసు కదా?
ఆనాడు జరిగిన సంఘటన చెబుతాను వినండి అన్నారు బాబా!!
ఆ పర్యటనలో నాతోపాటు ఛాంజీ, ఘనీ, ఆదీ సీనియర్, కాకాబారియా,
రుస్తుం తదితరులు పాల్గొన్నారు.
స్థానిక ప్రేమికులు నాపై ప్రేమతో ఒక ఫోటో తీసుకుంటామన్నారు.
నేను సరేనన్నాను.
ఫోటో తీయడం కోసమని నన్ను ఎముకలు కొరికే చలిలో నిలుచోబెట్టారు.
నేను పలుచని సాద్రా ధరించి వున్నాను.
నేను చలిలో తిరిగితే నాకు జలుబు చేస్తుందని వారు ఊహించలేదు.
ఇలాంటి వాటన్నింటికీ అవతారుడు అతీతుడనుకున్నారు.
1922–23 మధ్య కాలంలో నేను ముంబాయిలోని మంజిల్–ఇ–మీంలో
ఉండే రోజుల్లో చలికాలంలో బయట ఎంత చలిగా వున్నా
నేను సాద్రాలోనే తిరుగుతుండేవాడిని.
ఆ రోజుల్లో మెహెరాబాద్‌లో కూడా బాగా చలిగా వుండేది.
ఇంతకీ ఇంగ్లాడులో ఆ రోజున ఓ చెంప మంచు కురుస్తుంటే,
ఆ మంచువానలో నన్ను పలుచని సాద్రాలో నిలుచోబెట్టి భిన్న ఫోజుల్లో
వాళ్ళు ఫోటోలు తీసుకున్నారు. ఆ రోజున ఎంత చలిగా వుందో మాటల్లో చెప్పలేను.
రకరకాల ఫోజుల్లో ఫోటోలు తీసుకోవడానికి ఎముకలు కొరికే చలిలో నన్ను
నిలుచోబెట్టి ఒక చోట నుండి మరో చోటకు వాళ్ళు నన్ను తీసుకెళ్ళారు.
ఈ రోజు ఉదయం మండలి హాలులో పెండూతో నాకు గట్టి వాదన జరిగింది.
ముందు జాగ్రత్త లేదని అతడ్ని గట్టిగా చివాట్లు పెట్టాను.
సహవాస్ ఏర్పాట్లు కోసం ముందుగా ఒక్కొక్క పాంతం నుండి
ఒక వారానికి 150 మంది వస్తారని అంచనా వేశాం.
నాలుగు వారాలకు గాను మొత్తం ఖర్చు రూ. 20 వేలు అని అంచనా.
ఇవి కాకుండా నాలుగు వారాలలో పేదలకు అన్నదానం కార్యక్రమానికి
అదనంగా 10 వేలు కేటాయించడమైంది. ఐతే, పలు ప్రాంతాల నుండి వచ్చేవారి
సంఖ్య అంచనాలకు మించి పోయింది. ఖర్చు రెట్టింపయ్యింది.
ఆ తర్వాత బాబా మాట్లాడుతూ, రేపు ఉదయం 9 నుండి 10 గంటల దాకా పేదలకు
అన్నదాన కార్యక్రమం వుందన్నారు. నిన్నటి రోజున ప్రేమ, విధేయతల గురించి
చెప్పాను. ఈ రోజు “బంధనాల” గురించి వివరిస్తానన్నారు.

నేను ఎల్లప్పుడూ స్వేచ్ఛగా, ఎలాంటి బంధనాలు లేకుండా వున్నాను.
ఐతే, నేను ఈ భూమ్మీదకు రాగానే నాకు నేనుగా బంధనాలలో చిక్కుకున్నాను.
మీరెంత అదృష్టవంతులో ఒక్కసారి ఆలోచించండి.
ఎన్నో సంవత్సరాలుగా భగవద్దర్శనం కోసం పరితపించేవారికి
దొరకని అవకాశం మీకు ఈనాడు అవలీలగా లభించిందన్నారు బాబా.
కాబట్టి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరచుకోండన్నారు.
నేను ఉన్నతులలో ఉన్నతోన్నతుడను.
అలాగే చిన్నవాళ్ళలో అతి చిన్నవాడనన్నారు.
ఈ మధ్య స్థితిలోనే నేను మీ అందరితో పిచ్చాపాటీగా మాట్లాడుతూ,
కలిసి మెలిసి తిరుగుతూ, నవ్వుతూ, ఆటలాడటమూ చేస్తున్నానన్నారు బాబా.
మీరు నా భౌతిక దేహాన్ని మాత్రమే చూస్తున్నారు.
నేను అందరిలోనూ వున్నాను. ఒకటవ భూమికలోని వానిలో, రెండు మూడు భూమికల
నుండి ఏడవ భూమిక దాకా అందరిలోనూ వున్నాను.
అలాగే నేను అంతటా, అన్నింట్లో అందరిలో వున్నాను.
నాకు ప్రతి ఒక్కటి, ప్రతి ఒక్కరూ సమానమే.
క్రమేణా నా దరి చేరేవారు నాకు సంపూర్ణంగా అంకితమవుతారు.
నాపై పూర్తిగా ఆధారపడతారు. ఇది ప్రతి అవతార కాలంలోనూ జరుగుతోంది.
యుగయుగాలుగా ఈ విధానం కొనసాగుతోంది.
ఇదే విషయాలను రాబోయే మూడు వారాలలో ఇక్కడ జరిగే సహవాస్‌లో చెప్తాను.
నాకు ఇష్టమైన వారందరూ నాపై ఆధారపడి వుంటున్నారు.
నా పనిని నిర్వర్తించేందుకుగాను వారికి తగిన ఆదేశాలు ఎప్పటికప్పుడు ఇస్తున్నాను.
వారికి నాపై ఆధారపడటమనేది రోజురోజుకీ అధికమౌతుంది.
ప్రతి అవతార కాలంలో ఇది సహజంగా ఇలాగే జరుగుతుంది.
ఇంతక్రితం మెహెరాబాద్‌లో ఆశ్రమ స్కూళ్ళు, ఆసుపత్రులు వంటివి ఏర్పాటు చేశాను.
నా దగ్గర నిధులు వున్నప్పుడు వాటికోసం ఖర్చు చేశాను.
నిధులు లేనప్పుడు వాటిని మూసివేశాను.
నేనెన్నడూ శాశ్వత కార్యక్రమాలంటూ చేయను.
ప్రపంచంలో జరిగే విషయాలకు భిన్నంగా నా పనులుంటాయి.
ప్రతి ప్రేమికుని హృదయం నా ఆశ్రమం.
ఎవరైనా ప్రేమగా ఏదైనా ఇస్తే దాన్ని స్వీకరించి,
వెంటనే దాన్ని ప్రేమతో ఎవరికైనా ఇచ్చేస్తాను.
నేడు సమయం ఆసన్నమైంది.

అన్ని బంధనాలకు ఇకపై దూరంగా వుంటాను.
నేను చెప్పేవన్నీ వాగ్దానాలుగా భావించవద్దు.

**I am free from promises.**

నాకొక అలవాటుంది. అదేమంటే, ఈరోజు నేనొక హామీ ఇచ్చి,
ఆ మర్నాడు దాన్ని మరచిపోయే అలవాటు నాకు వుంది.
1956 ఫిబ్రవరి 15 నుండి అన్ని బంధనాలకు దూరంగా ఏకాంతవాసంలో వుంటాను.
ఈ సమయంలో నేను చేయవల్సిన ముఖ్యమైన పనులు చాలా ఉన్నాయి.
నాపై ఆధారపడిన వారికోసం తగిన ఏర్పాట్లు చేయ్యాలి.
దానికి తగిన ప్రణాళికలు నా దగ్గర వున్నాయి.
ఈ ఏకాంతవాస సమయంలో నాతో ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండవు.
నాతోపాటు ఎంతో కాలంగా నా దగ్గరగా వున్నవారిని కూడా చూడకుండా
ఏకాంతంలో వుంటాను.
అలాగే, స్త్రీల కోసం ఒక ప్రత్యేక దర్శన కార్యక్రమం ఏర్పాటు
చేయాలని ఆలోచిస్తున్నాను. పలు ప్రాంతాల నుండి మహిళలు తమకు
ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించమని ఎన్నోమార్లు లేఖలు, టెలిగ్రాంలు ఇచ్చారు.
నా దర్శన కార్యక్రమం ఒక దావాలనంలా పలు ప్రాంతాలకు విస్తరించింది.
మహిళలు, వారి పిల్లలందరితో కలిసి ఇక్కడి దాకా రావడం చాలా కష్టం.
అందుకోసం, ఒక్కొక్క ప్రాంతంలో రెండ్రోజులు చొప్పున నా దర్శన కార్యక్రమం
ప్రత్యేకంగా మహిళల కోసం ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నాను.
అలాగే నేను అమెరికా వెళ్తున్నానని వదంతులు వినిపిస్తున్నాయి.
ఇంకా తేదీలు ఖరారు కాలేదు.
ఏది ఏమైనా 1956 ఫ్రిబ్రవరి 15 నుండి అందరికీ, నా మండలివారందరికి కూడా,
దూరంగా, ఏకాంతంగా వుండాలని నిశ్చయించుకున్నాను.
అందుకు మరో రెండు నెలలు – డిశంబరు, జనవరి దాకా గడువు వుంది.
ఈ సమయంలోనే నాపై ఆధారపడిన వారందరికీ
తగిన ఏర్పాటు చేయాలన్నారు బాబా.

## మెహెర్‌బాబా ప్రేమ సందేశ వ్యాప్తి

బాబావారి ప్రేమ సందేశ వ్యాప్తి ఎలా చేపట్టాలన్నది నాల్గవ అంశం.
తెలుగువారు గ్రామ గ్రామాన నా నామాన్ని చక్కగా వ్యాప్తి చేసేందుకు కృషి చేస్తున్నారు.
అలాగే ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని హమీర్‌పూర్ జిల్లాలో కూడా
పిల్లాపెద్దలందరికీ మెహెర్ 'ప్రేమ సందేశం' వ్యాప్తి జరిగింది.

హమీర్‌పూర్‌లో ఒకటి రెండు గ్రామాల్లో నాపట్ల వ్యతిరేకత వచ్చింది.
కానీ చక్కని మహిమ జరిగి వారందరూ నేడు బాబా నామం జపిస్తున్నారు.
నాగపూర్‌లో డా॥ సి.డి. దేశ్‌ముఖ్, నానాఖేర్, పోఫాలి,
ఢిల్లీ, డెహ్రాడూన్‌ల వైపు కిషన్ సింగ్ బాబా నామాన్ని,
ప్రేమ సందేశ వ్యాప్తికి కృషి చేస్తున్నారు.
దేశంలో చాలాచోట్ల నా ప్రేమికులు బాబా ప్రేమ సందేశాన్ని
పలువురికి తెలియజేసే పనిని చక్కగా చేస్తున్నారు.
ఐతే ఈ పార్శీలున్నారే, వీరు నా క్రీస్తు అవతారంలో
వీరు **యూదులు**లాంటివారు.
వీరే కదా క్రీస్తుకు శిలువ వేయబడటానికి కారకులు.
ఈ అవతారంలో నేను జోరాష్ట్రియన్ మతంలో జన్మించాను.
ఈ పార్శీయులు ఆనాటి **యూదుల్ని** గుర్తుకు తెస్తున్నారు.
పార్శీయుల్లో చాలామంది నన్ను ప్రేమించేవారున్నారు.
పార్శీయుల్లో నన్ను వ్యతిరేకించేవారు అంతే సంఖ్యలో వున్నారు.
మన దేశంలో నేను ఎక్కడ పర్యటిస్తున్నా వేలాది మంది ప్రజానీకం
నా దర్శనార్థం వస్తున్నారు.
వేల సంఖ్యలో ప్రజానీకం నా దర్శనం కోసం రావాలని నేను కోరడం లేదు.
నేను మీ అందరినీ కోరేది ఏమిటో శ్రద్ధగా ఆలకించండి!

1. నా ప్రేమ సందేశాన్ని మీరు ఎలా వ్యాప్తి చేయగలరు?
2. నా ప్రేమను ప్రజలకెలా తెలియజేస్తారు?
3. వారు నన్ను ప్రేమించేలా మీరెలా కృషి చేయగలరు?
4. నేనెవరో తెలుసుకునేలాగా, నేనెవరో వారికి అర్థమయ్యేలాగా మీరేం చేయగలరు ?? అని బాబా సహవాసీలను ప్రశ్నించారు.

ఇందుకు బాబా సమాధానం చెబుతూ,
ముందుగా మీరు నా ప్రేమికులు కావాలి.
మీరెక్కడకైనా వెళ్ళి, నా గురించి చెప్పవల్సిన సందర్భంలో
**'బాబా తన సందేశంలో ఇలా చెప్పారని'**
చెప్పేముందు బాబా చెప్పిన ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా చెప్పేందుకు
నీవు సిద్ధంగా వుండాలి.

**బాబా చెప్పిన విషయాలు:-**

1. ఎల్లవేళలా 'సత్యం' మాత్రమే మాట్లాడాలన్నారు.
2. ఇతరులను పరోక్షంగా కూడా ధూషించరాదన్నారు.

3. ఎవ్వరినీ ద్వేషించవద్దన్నారు.
4. ఎవరిపైనా శత్రుత్వం వలదన్నారు.
5. ఎవరి మనస్సు నొప్పించేలా ప్రవర్తించవద్దన్నారు.

**'ఇదీ బాబా సందేశం'** అని నీవు ప్రజలకు చెప్పాలి.
నీ మనస్సు పరిశుభ్రంగా వుంటేనే నీవు బాబా సందేశాలను తు.చ.
తప్పక ఆచరించిన నాడే ఇతరులెవరికైనా నీవు ధైర్యంగా చెప్పగల్గుతావు.
అప్పుడే వారు బాబా సందేశం పట్ల ఆకర్షితులవుతారు.
కాబట్టి నీవు బాబా సందేశాన్ని ఆచరించి, ఆచరింప చేయటానికి
ప్రయత్నించాలని బాబా అన్నారు.
ఒక వేళ నీవు ఆ మాదిరిగా స్వచ్ఛంగా ఆచరించలేనప్పుడు
దయచేసి మారు మాట్లాడకుండా మౌనంగా వుండమన్నారు.
ఈ ప్రపంచం, ప్రజలు నన్ను ప్రేమించినా లేదా ద్వేషించినా –
అన్నీ నాకు సమానమే. నాకేం తేడా లేదు.
నా భగవత్ స్థితి ఏమాత్రం చెక్కు చెదరదు.
నా ప్రేమ సందేశానికి నీవొక ఉదాహరణగా వుండాలి.
నా నిజమైన ప్రేమికుడు ఒకేఒక్కడున్నా అతడు అనేక అద్భుతాలు చేయగల్గుతాడు.
అలాంటివాడు ఈ యావత్ ప్రపంచాన్ని మార్చగల్గుతాడు.
మీరందరూ ఏకంగా, నా ప్రేమ సందేశానికి ప్రతీకలుగా ఉంటే
ఈ విశ్వమంతా ప్రేమ మయమౌతుంది.
ద్వేషం, స్వార్థం కనుమరుగైపోతాయి.
నాకు తెలుసు – మీలో చాలామంది నా గురించి,
నా ప్రేమ సందేశాల గురించి అనర్గళంగా ప్రసంగించగలరు.
నా సందేశాల వ్యాప్తిలో మీ వాక్చాతుర్యంతో అద్భుతంగా ప్రజలను ఆకర్షించగలరు.
కాని, మీకు మీరుగా మాత్రం, నా సందేశాలను ఆచరణలో అమలు చేయలేరు.
మీరు ఆ బలహీనతను జయించలేరు.
మీరు పాటించలేని నా సందేశాలు,
ఇతరులకు తెలియజేయడముంది చూశారూ...
అదొక ఇది హిపోక్రసీ. కపటం అవుతుంది.
అదొక గొప్ప కపట నాటకం క్రింద జమకట్టాలి.
ఈ సహవాస్‌లో మీరూ నేను ఎంతో సన్నిహితంగా మాట్లాడుకుంటున్నాం కాబట్టి,
మీకీ విషయాలు క్షుణ్ణంగా చెబుతున్నానని,
ఆనాటి సమావేశం ముగిసిందని బాబా ప్రకటించారు. ❀

# పూనే సెంటర్ పసిడి పండుగ వేడుకలు

(పి.యస్.కె. శర్మ)




అవతార్ మెహెర్‌బాబా పూనే సెంటర్ పసిడి పండుగ వేడుకలు 2014 మే 1,2 తేదీలలో ఘనంగా ముగిసాయి. సుమారు 1500 మంది బాబా ప్రేమికులు విచ్చేసారు. మే 1న కార్యక్రమాలను లాంఛనంగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీమతి ఊర్మిలా గాడేకర్ జ్యోతిని వెలిగించారు. బాబావారి సప్తవర్ణ పతాకాన్ని అవిష్కరించారు. రెండ్రోజుల సహవాస్‌లో భాగంగా చర్చా వేదికలు నిర్వహించారు. బాబాసందేశాలపై ప్రసంగాలుతో కార్యక్రమం ఆద్యంతం అవతారుని సమక్షంలో చక్కగా కొనసాగింది.

పూనే సెంటర్ కార్యదర్శి శ్రీ ప్రతాప్ ఆహిర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మెహెర్‌బాబా స్వయంగా రెండు సెంటర్‌లను ప్రారంభించారు.

1. అహ్మద్‌నగర్ బాబా సెంటర్. దీన్ని 20-10-1962 బాబా ప్రారంభించారు.
2. పూనే సెంటర్. 01-05-1964 బాబా ప్రేమతో ప్రారంభించారు.

ఈ రెండు సెంటర్లు ఇతర బాబా సెంటర్లకు ఆదర్శంగా నిలవాలని బాబా కోరారు.

గత ఐదు దశాబ్దాల ప్రస్థానంలో, పూనే సెంటర్ ఎదుర్కొన్న అనేక ఆటుపోట్లను చాలా వివరంగా ప్రతాప్ ఆహిర్ గ్రంధస్థం చేశారు.

ఈ పుస్తకం ఇంగ్లీషులో వుంది. పుస్తకం పేరు -

**AVATAR MEHER BABA POONA CENTRE**
**......AN ENDURING JOURNEY.**

పూనే సెంటర్ ఏర్పాటులో జరిగిన అనేక ప్రధాన ఘట్టాలు, అనేక ఒడిదుకులను రచయిత కళ్ళకు కట్టినట్లు చూపే ప్రయత్నం ఈ పుస్తకంలో చేశారు.

ఈ గ్రంధాన్ని బాబా ట్రస్టు చైర్మన్ శ్రీధర్ కేల్కర్ అవిష్కరించారు.

ఈ గ్రంధంలోని పలు అంశాలను సంక్షిప్తంగా స్పృశిస్తూ ఓ ప్రత్యేక శీర్షికను

14,15 పేజీలలో క్లుప్తంగా ఇవ్వడమైంది. దయచేసి పరిశీలించండి.
పూనే సెంటర్ ప్రారంభోత్సవ చిత్రాలను కంప్యూటర్ ద్వారా
శ్రీ దిగంబర్ గాడేకర్ ప్రదర్శించారు.
ట్రస్టీ సభ్యులు మెహెర్‌నాథ్ కల్చురీ బాబా సందేశాలపై ప్రసంగించారు.
ప్రేమ మూర్తీభవించిన అవతారుడు మెహెర్‌బాబా అని ఆయన అన్నారు.
**ఖుధీ కు ఖతం కర్. - ఖుదా మిలేగా...**అంటే నిన్ను నీవు మరచి పో..
నీకు భగవంతుడు దొరుకుతాడు..అని మెహెర్‌నాథ్ తన ప్రసంగంలో అన్నారు.
బి.రామక్రిష్ణయ్య, 1954లో మెహెర్‌బాబా ఆంధ్రా పర్యటన సందర్భంలో
రాజమండ్రిలో బాబా ప్రేమికులను ఉద్దేశించి ఇచ్చిన ప్రత్యేక సందేశాన్ని వివరించారు.
కాగా, ఈ వేడుకలలో భాగంగా మొదటి రోజు సాయంత్రం 5.15 నుండి 6.15
దాకా బాబా కార్యక్రమాల నిర్వహణకు బాబా కేంద్రాలు ఎలా పనిచేయాలి?
అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. హెచ్. దాదా ఛాంజీ, రాజేంద్ర మెహెర్,
జిల్‌పిల్‌వార్ మాధవరావు ఈ చర్చలో పాల్గొన్నారు.
రెండ్రోజుల పూనే సహవాస్‌లో ఈ చర్చావేదిక చక్కని సందేశం ఇచ్చిందని పలువురు
అభిప్రాయపడ్డారు. రాజేంద్ర మెహెర్, హైదరాబాద్ ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్
సహవాసీలను ఆకట్టుకుంది.
ఈ అంశం కొత్తదేమీ కాదు. కొవ్వూరులో మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవం అయిన
మర్నాడు నాటి బాబా ప్రేమికులు ఆదీ కె ఇరానీ, జియస్‌యన్ మూర్తి,
సర్దార్ అమర్ సింగ్ సైగల్, డాక్టర్ సిడి దేశ్‌ముఖ్, ఇలా అనేకమంది ఇదే అంశంపై
తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. 1955 నవంబరు మాసంలో మెహెరాబాద్‌లో
జరిగిన నాలుగువారాల ప్రాంతీయ సహవాస్‌లో కూడా మెహెర్‌బాబా స్వయంగా
ఈ విషయమై చాలా వివరంగా చెప్పారు. ఇవన్నీ కూడా జరిగి 50 సంవత్సరాలు
పైబడింది. నేటికీ ఈ విషయం చర్చనీయాంశంగా ప్రాధాన్యత సంతరించుకోవడం
ఓ విశేషం. రెండో రోజు సమావేశంలో కర్మకాండలు- పూజా విధానంపై
చర్చా వేదిక, బాబాను దర్శించుకున్న వారి అనుభవాలపై ప్రసంగం నిర్వహించారు.
శ్రీ నోరి మెహెర్‌చంద్, హైదరాబాద్ తాను తల్లి గర్భంలో ఉండగానే బాబాను
దర్శించుకున్నానన్నారు. అనంతరం 1964, 1965 లలో మెహెర్‌బాబా దివ్యమంగళ
దర్శన భాగ్యం తనకు కలిగిందని నోరి మెహెర్‌చంద్ తన అనుభవాలను వివరించారు.
గోపి బృందం భజన గీతాలు సభికులనందరినీ అలరించాయి.
రెండు రోజులపాటు నిర్వహించిన పూనే సెంటర్ పసిడి వేడుకలు ఘనంగా ముగిసాయి.
మూడో రోజున పూనేలోని బాబాకు సంబంధించిన అనేక ప్రదేశాలను సందర్శించే
ఏర్పాటు చేశారు.

# అర్థ శతాబ్దిలో - మైలురాళ్ళు

**AVATAR MEHER BABA POONA CENTRE ......AN ENDURING JOURNEY**

అవతారుని జన్మస్థానం పూనే నగరం. సద్గుర్విణి బాబాజాన్ మేర్వాన్ భృకుటిన ముద్దాడిన ప్రాంతం పూనే నగరం. పూనే నగరంలో తొలిసారిగా 1947 ప్రాంతంలో బాబా ప్రేమికుడు రామచంద్ర గాడేకర్ ఇంట్లో బాబా సెంటర్ చాలాకాలం పాటు నిర్వహించారు. ఆయన మహారాష్ట్ర ప్రభుత్వంలో సాంఘిక సంక్షేమ శాఖలో ఉన్నతాధికారిగా పనిచేశాడు. ఆ సమయంలో ఆయన షోలాపూర్ నుండి బదిలీపై పూనే వచ్చారు. మెహెర్‌బాబాతో ఆయనకు విద్యార్థి దశ నుండీ పరిచయముంది. మెహెర్‌బాబా మెహెరాబాద్‌లో మెహెరాశ్రమం పెట్టిన తొలినాళ్ళలో రామచంద్ర గాడేకర్ ఆశ్రమ విద్యార్థులకు పాఠాలు చెప్పాడు. అనంతరం, 1929లో ప్రభుత్వోద్యోగిగా స్థిరపడ్డాడు. షోలాపూర్ తదితర ప్రాంతాల్లో పనిచేసి పూనే చేరుకున్న గాడేకర్ ఇంట్లో చాలాకాలంపాటు బాబా సెంటర్ నిర్వహించారు. లక్ష్మీ కాంత్ థాడే, మధుసూధన్, ప్రతాప్ ఆహిర్, డా. ఘనీ ఇలా పలువురు పూనే సెంటర్ కార్యక్రమాలకు హాజరయ్యేవారు. ఆ దరిమలా బాబా సెంటర్‌ను అప్పారావు ముదలియార్ అనే బాబా ప్రేమికుని ఇంట్లో నిర్వహించారు. అది 1950వ దశకం.

1954 ప్రాంతంలో పూనే బాబా సెంటర్‌లో క్రొత్త సభ్యునిగా (కె.కె) కె.కె.రామకృష్ణన్ చేరాడు. దాదాపు ఆ సమయంలోనే రామకృష్ణన్ బాబాను దర్శించుకుని, సంపూర్ణంగా అవతారుని సేవాకార్యక్రమాలకు అంకితమయ్యాడు.

ఈ సెంటర్‌ను మెహెర్‌బాబా కూడా 1957 జూన్ 8న సందర్శించారు. సెంటర్ నిర్వహణపై అనేక సూచనలు చేశారు. ముదలియార్‌ల ఇంట్లో బాబా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు కదా...నిధులు ఏమైనా ఉన్నాయా? వారం వారం జరిగే సత్సంగ్‌లకు డబ్బు ఎలా సర్దుబాటు చేస్తున్నారు..వగైరా సమాచారం కూడా బాబా అడిగి తెలుసుకున్నారు. పూనే సెంటర్ ప్రేమికులు గురుప్రసాద్‌లో జరిగిన ప్రతీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.

కె.కె. రామకృష్ణన్ బ్రహ్మచారి. భారతీయ సైనిక దళంలో 17 సంవత్సరాల వయస్సులో చేరి ఆ పిదప వాలంటరీ రిటైర్మెంటు తీసుకుని పూనేలో స్థిరపడ్డాడు. మెహెర్‌బాబాకు సంబంధించిన అనేక గ్రంథాలు, సాహిత్యం ఆసాంతం చదివాడని ఆయన సమకాలీనులు చెప్తారు. మెహెర్ సందేశాలపై అనర్గళంగా

ప్రసంగించే వాడు కె.కె. పూనేలో బాబా సెంటర్ నొకదాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన కె.కె.కు వచ్చింది. ఆనాటి పెద్దలతో ఈ విషయమై ముచ్చటించాడు. ఎప్పటిలాగానే నాలుగు అడుగులు ముందుకు, రెండడుగులు వెనక్కి లాగారు. ఈ డోలాయమానంలోనే ఒక సందర్భంలో మెహెర్‌బాబా ఎదుట వారి ఆలోచన ఉంచారు. ఆనాటి రోజుల్లో పూనే సెంటర్ ప్రేమికులందరూ దిగువ మధ్యతరగతికి చెందినవారే. ఈ విషయం అవతారునికి బాగా తెలుసు.

నిధులు సమకూర్చడం గురించి బాబాకు వివరిస్తూ **'నాదగ్గర వున్న సేవింగ్స్ అంతా బాబా సెంటర్ నిర్మాణానికి** ఇస్తానన్నాడు శ్రీ కె.కె. ఆపైన ఆంధ్రా ప్రాంతం, ఇతర బాబా సెంటర్ల నుండి విరాళాలు సేకరిస్తామన్నాడు.

బాబా అందుకు అంగీకరించారు. వెంటనే ప్రస్తుతం మనం చూస్తున్న బాబా సెంటర్ జాగాను ఎంపిక చేసి కొనుగోలు చేశారు.

1961 ఫిబ్రవరి 25, బాబావారి జన్మదినం వేడుకల రోజున శంఖుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. సూఫీ గ్రూపు ప్రతినిధి, అమెరికా దేశ బాబా ప్రేమికుడు **జోసఫ్ హార్బ్‌ని** బాబా తన ప్రత్యేక ప్రతినిధిగా పంపారు.

ఈ సెంటర్ నిర్మాణ విషయంలో ఆంధ్రులు ముఖ్యంగా శ్రీ వెంకయ్య, హైదరాబాద్, అలాగే ఆనాటి బాబా ట్రస్టు చైర్మన్ కుటుంబశాస్త్రి ఇతోధికంగా సహాయం అందించారని ప్రతాప్ ఆహిర్ తన రచనలో పేర్కొన్నారు. తెలుగువారు ఎంతగానో ప్రోత్సహించారని ఆయన అభిభావన. తెలుగువారి నుండి విరాళాల సేకరణకు కె.కెతో పాటు బాబా సోదరుడు జాల్‌ను ప్రత్యేకంగా పలు ప్రాంతాలకు పంపారు. ఐతే ఈ నిధుల సేకరణ, అనంతరం సెంటర్ భవన నిర్మాణంలో కె.కె. ఎన్నో అవమానాలు, అనుమానాలు, చీత్కర ధూషణలు ఎదుర్కొన్నాడు. ఈ పంచాయతీ అవతారుని దాకా వెళ్ళింది. బాబా స్వయంగా కలగజేసుకున్నారు. కె.కెకు అనుకూలంగా వున్నవారిని, అలాగే వ్యతిరేకుల్ని తన ఎదుట కూర్చోబెట్టారు. కె.కె. బాబా సెంటర్ పనుల నుండి వైదొలుతానన్నాడు. బాబా అందుకు అంగీకరించ లేదు సరికదా...

నీవు అలా చేస్తే, నేను పూనే నగరానికి రానని ప్రకటించారు.

అంతటితో ఆ సమస్యకు పరిష్కారం దొరికింది. ఆ పిదప సెంటర్ భవన పనులన్నీ పూర్తయ్యాక, 1964 మే 1వ తేదీన సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించడానికి అవతారుడు అంగీకరించారు. ఆ సమయంలో బాబా ఏకాంతవాసంలో వున్నారు. కేవలం దగ్గర ప్రేమికులను మాత్రమే ఆహ్వానించమన్నారు. బహిరంగ దర్శన కార్యక్రమం మాదిరి ఏర్పాటు చేయొద్దన్నారు. ఏమైనా ఆనాటి సెంటర్ ప్రారంభోత్సవానికి సుమారు 500 మందికి పైగా విచ్చేసారు. సప్తవర్ణ శోభిత రిబ్బన్‌లను లాంఛనంగా కత్తిరించి, పూనే సెంటర్‌ను తన ప్రేమికులకు బాబా అంకితం చేశారు.

ఆ సందర్భంగా బాబా ఎదుట మధుసూధన్ బృందం చక్కని పాటలు ఆలాపించారు. చిన్నారి ఆడపిల్లలు నృత్యం చేస్తూ అవతారునికి స్వాగతం పలికారు. ప్రత్యేకంగా తయారుచేయించిన మెత్తని సోఫాలో బాబా కూర్చుని సభికులందరికీ దర్శనం ఇచ్చారు.

**బాబా సాహిత్యం**

పూనే సెంటర్ తరఫున రామకృష్ణన్ బాబా సాహిత్యాన్ని చిన్న కరపత్రాలుగా అనేక అంశాలపై ప్రచురించారు. పూనే సెంటర్ పుస్తక ప్రచురణలను బాబా ప్రేమికులు ఎంతగానో ఆదరించారు. సుమారు 28 అంశాలపై కె.కె. పూనే సెంటర్ తరఫున ప్రచురించారు. అమెరికన్ దేశీయులు సయితం ఈ ప్రచురణల పట్ల ఎంతో మక్కువ చూపేవారు. ఐతే ఈ ప్రచురణల ముద్రణ పట్ల కూడా ఆనాటి సమకాలీనులు కోడిగ్రుడ్డుకి ఈకలు పీకినట్లు కె.కెని ఇరకాటంలో నెట్టారని గ్రంధ రచయిత పేర్కొన్నారు. పూనే సెంటర్ కార్యక్రమాలతో తన జీవితాన్ని పెనవేసుకున్న కె.కె.రామకృష్ణన్ 2008లో బాబాలో ఐక్యమయ్యారు. గత ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో అనేక ఉద్దాన పతనాలు స్థానికులు చవి చూశారు. వాటన్నింటికి ప్రత్యక్ష సాక్షిగా ప్రతాప్ ఆహిర్ నిలుస్తాడు. తన అనుభవాలు, జ్ఞాపకాల దొంతరలను గ్రంథం చేసిన ప్రతాప్‌జీ, శ్రీ కె.కె. రామకృష్ణన్ పూనే బాబా సెంటర్‌కు తన జీవితాన్ని అంకితం చేసాడన్నారు. అదెలాగో చిన్న సంఘటనలో రచయిత లఘువుగా వివరిస్తూ, బాబా సెంటర్‌ను ఆనుకుని కె.యి.ఎం ఆసుపత్రి వుంది. సెంటర్‌కు తూర్పు వైపున ప్రహరీ నిర్మించాలని ఆసుపత్రివర్గాలు కె.కెను కోరారు. అందుకు ఆయన అంగీకరించాడు. ఆ తర్వాత హాస్పటల్ వాళ్ళు ఏవో కొన్ని బలమైన ఎలక్ట్రికల్ మిషనరీని ఆ ప్రహరీ గోడ ప్రాంతంలో వాడారు. దాంతో వాటి అదురులకు ఒక రోజున కట్టిన ప్రహరీ గోడ పడిపోయింది. పవర్‌ఫుల్ మిషనరీ వాడటం వల్లనే ప్రహరీ పడిపోయింది కాబట్టి, నష్టపరిహారంగా తిరిగి ప్రహరీ గోడ హాస్పటల్‌వారు నిర్మించాలని కె.కె పట్టుపట్టాడు. అందుకు వాళ్ళు సుతరామూ అంగీకరించలేదు. దాంతో ప్రహరీ నిర్మించేదాకా తాను అన్నపానాదులు ముట్టనని కె.కె. ప్రతిన పూనాడు. బాబా ప్రేమికులు ఎందరు నచ్చచెప్పబోయినా వారి ప్రయత్నాలు ఫలించ లేదు. కె.కె. మొండి పట్టు వీడలేదు. ఆరోగ్యం క్షీణించింది. ఈలోగా ఆస్పత్రివారు దిగొచ్చారు. ప్రహరీ నిర్మాణం చేపట్టారు. అప్పటికి శ్రీ కె.కె. దీక్ష చేపట్టి 22 రోజులు పూర్తయింది. మరో రెండు రోజులు మించి ఆతని ఆరోగ్యం నిలకడగా ఉండదని స్థానిక ససూన్ ఆసుపత్రి వాళ్ళు హెచ్చరించారు. గోడ కట్టే పనులు 50 శాతం పూర్తయ్యింది. బాబా ప్రేమికుల విజ్ఞప్తుల్ని అంగీకరించి 23వ రోజున పళ్ళ రసం తీసుకున్నాడు. గత 50 వసంతాలలో ఇలాంటి ఒడిదుడుకులు ఎన్నో.. ఎన్నెన్నో. ఇవన్నీ అవతారుని పరీక్షగా భావించి ముందుకు సాగుతున్నామని సెంటర్ కార్యదర్శి ప్రతాప్ ఆహిర్ అన్నారు.

ఇదీ పూనే సెంటర్ ఏబది ఏళ్ళ ప్రస్థానం.. క్లుప్తంగా...,

# బాబా సాద్రా

పూనే పట్టణంలోనే స్థానిక విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న
ఒక ప్రొఫెసరు భగవదన్వేషణలో భాగంగా ఎన్నో గ్రంధాలు చదివాడు.
సద్గురువు సాంగత్యం కోసం వెంపర్లాడుతున్నాడు.
ఎంతో కాలంగా నిరీక్షిస్తున్నాడా ప్రొఫెసరు.
ప్రతిరోజూ సాయంత్రం పూట పలు దేవతామూర్తుల దగ్గర
కొవ్వొత్తులు వెలిగించి ప్రార్ధనలు చేసేవాడాయన.
ఒకరోజున వారు యధాలాపంగా వారి పనిలో వారుండగా,
ప్రొఫెసర్ గారి భార్య ఒక దృశ్యాన్ని చూసింది.
తెల్లని సాద్రా ధరించిన ఒక వ్యక్తి ఆమె ముందుకు వచ్చి
"ఇలాంటి దుస్తులు వేసుకోమని నీ భర్తతో చెప్పు" అని
తన సాద్రాకేసి చూపించాడా వ్యక్తి. ఆ తర్వాత ఆ వ్యక్తి తన మానాన వెళ్ళిపోయాడు.
ఈ విషయాన్ని తన భర్తతో చెప్పింది.
కానీ ఆ సాద్రా ఎలాగుందనే విషయాన్ని ఇదమిద్ధంగా వివరంగా చెప్పలేక పోయింది.
ప్రొఫెసర్ ఆ చొక్కా ఎలాగుందని అడిగితే.
"ఏమో, అలాంటి అంగీని తానెప్పుడూ చూడలేదన్నదామె.
ఆ వ్యక్తి కోసం చాలా వెదికారు.
కానీ, ఆతను తిరిగి వారి కంటికి పడలేదు. చాలా రోజులు వెదికారు.
కానీ ఫలితం లేదు. ప్రొఫెసర్ గారి దగ్గరవున్న ఆధ్యాత్మిక గ్రంధాలన్నీ తిరగేసి
ఆమెకు అందులో బొమ్మలన్నీ చూపించాడు. కాని అలాంటి సాద్రాలాంటి దుస్తులు
మాత్రం కానరాలేదు. ప్రొఫెసర్ గారికి ఆమె మీద చాలా కోపం వచ్చింది.
ఒకరోజు సాయంత్రం ప్రొఫెసర్ గారు, ఆయన భార్య వ్యాహ్యాళిగా కె.ఇ.యం.
ఆసుపత్రి కేసి వెళ్ళారు. అక్కడి దగ్గర్లోనే తిరుగుతూంటే **"అవతార్ మెహెర్‌బాబా పూనే సెంటరు"** అనే సైన్ బోర్డును చూసి సెంటరు భవనంలోకి వెళ్ళారు.
అక్కడ మెహెర్‌బాబా చిత్రాలను చూడగానే, ప్రొఫెసర్ గారి భార్య బిగ్గరగా
"అదిగో ఆయనే, అదే చొక్కా" అని గట్టిగా కేక వేసింది.
ఆ కేక విని లోపల గదిలో వున్న కె.కె.రామకృష్ణన్ బయటకు వచ్చి
వారడిగిన సందేహాలన్నింటికీ జవాబిచ్చారు.
ఆ పిదప ప్రొఫెసర్‌జీ సాద్రా ధరించడం ప్రారంభించాడు.
కాలేజీకి వెళ్ళేటప్పుడు కూడా బాబా ఆదేశాలుగా సాద్రా ధరించేవాడు.
నేడు ఆ ప్రొఫెసర్, ఆయన భార్య, ఇద్దరూ గొప్ప బాబా ప్రేమికులయ్యారు.
ఎవరిని ఎలా అనుగ్రహించాలో ఆ బాబాకే తెలుసు కదా!! ❀

# జూలై 10 - మౌన దినం

మెహెర్‌బాబా ప్రేమికులందరికీ జూలై 10 చాలా పవిత్రమైన రోజు.
ఆ రోజున మెహెర్‌బాబా మౌనం ప్రారంభించిన రోజు.
బాబా తన ప్రేమికులనందరినీ ప్రతి సంవత్సరం జూలై 10న మౌనం పాటించమని ఆదేశించారు. ప్రతి ఏడాది జూలై 9 అర్థరాత్రి నుండి 10వ తేది అర్థరాత్రి 12 గంటల దాకా 24 గంటలు బాబా ప్రేమికులందరూ మౌనం పాటిస్తారు.
హైదరాబాద్‌లోని కోఠి సెంటర్, మెహెరస్థాన్, కొవ్వూరులతో పాటు తెలుగునాట గల అన్ని బాబా కేంద్రాలలో మౌనం పాటించే భక్తుల కోసం ఆయా సెంటర్ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఆంధ్రా రెస్టు హౌసులో

దూర ప్రాంతాల నుండి మెహెరాబాద్‌కు విచ్చేసే వారి కోసం ఆంధ్రా రెస్టు హౌసు తగిన భోజన, బస ఏర్పాట్లు ప్రత్యేకంగా చేస్తున్నారు. ఆంధ్రా రెస్టు హౌసులో బస ఏర్పాటు కోరువారు తమ వివరాలు జూన్ 28లోగా తెలియజేయాల్సిందిగా కార్యదర్శి ఒక ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాలకు

**ANDHRA REST HOUSE, OPP. BSNL TOWER, ARANGOAM-414 006, AHMADNAGAR DIST, MAHARASTRA**

చిరునామాకు లేఖ ద్వారా తెలియజేయవల్సింది. లేదా ఫోన్ 0241-2548544, సంప్రదించగలరు.

## బాబా ఏమన్నారు!!

మౌనం పాటించే విషయంలో మెహెర్‌బాబా తన ప్రేమికులను ఉద్దేశించి ఇలా అన్నారు. మీరు మౌనంలో వుండగా మీ మనస్సు పరిపరివిధాల పరిభ్రమిస్తూ వుంటుంది. ఎన్నో ఆలోచనలు వస్తాయి. అలాంటి ఆలోచనలను అడ్డుకోవద్దు. అయ్యో... అని బాధపడొద్దు. ఆలోచనలను ఫ్రీగా రానీయండి. అలాగే పోనీయండి. నా నామం తలుచుకోవడం మాత్రం మరిచిపోవద్దు అని బాబా అన్నారు. అలాగే, మౌనంగా వున్న సమయంలో పొరపాటున మాట్లాడినా, ఫరవాలేదు. అయ్యో... మాట్లాడేశానే! అని బాధపడకుండా తిరిగి మౌనం కొనసాగించమన్నారు.

"Never try to check the flow of thoughts.
Let thoughts come and go as freely as possible.
But you try to remember Me constantly and whole heartedly"

**- Meher Baba.**

# వివాహం

❀ శ్రీమతి ఎ. నళిని మరియు ఎ. శ్రీధర్‌రావు గార్ల పుత్రిక చి॥ల॥సౌ॥ ఎ. మెహెర్ స్వాతి వివాహం చి॥ చామర్తి ఫణి శేఖర్ తో ది. 11.05.2014 ఆదివారం ఉదయం గం. 10.30 ని॥లకు మారుతి గార్డెన్స్, హనుమాన్ మందిరం వద్ద, లకడికాపూల్, హైదరాబాద్‌లో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

❀ శ్రీమతి బలగ విజయలక్ష్మి మరియు శ్రీ బలగ లోకనాథం గార్ల పుత్రిక చి॥ల॥సౌ॥ దివ్య వివాహం చి॥ ప్రవీణ్ కుమార్‌తో ది. 15.05.2014 గురువారం రాత్రి గం. 9.59 ని॥లకు కె.కె. గార్డెన్స్, రఘురాంనగర్ కాలనీ, సన్‌సిటీ, హైదర్షాకోట్, హైదరాబాద్‌లో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

❀ శ్రీమతి భైసా లక్ష్మీబాయి మరియు శ్రీ బాలాజి సింగ్ గార్ల పుత్రుడు చి॥ సంతోష్ వివాహం చి॥ల॥సౌ॥ అశ్విని బాయితో ది. 21.05.2014 బుధవారం ఉదయం గం. 8.49 ని॥లకు ఇ.నెం. 16-9-24/6ఎ, ఊర్వశి టాకీస్ దగ్గర, కళ్యాణ్ నగర్, గోదావరిఖని, కరీంనగర్‌లో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

❀ శ్రీమతి మంత్రిప్రగడ బాలస్వతి మరియు సత్యబాపిరాజు గార్ల పుత్రుడు చి॥వరహాలరావు వివాహం చి॥సౌ॥ పద్మ శకుంతలా ప్రియాంకతో ది. 17.05.2014 శనివారం రాత్రి గం. 9.45 ని॥లకు శ్రీ లక్ష్మి శ్రీనివాసవ కళ్యాణ మండపం (నటరాజ్ థియేటర్), చిట్టివలససలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

❀

# ఖమ్మం బాబా సెంటర్ 51వ వార్షికోత్సవం

ఖమ్మం బాబా సెంటర్ 51వ వార్షికోత్సవం 2014 ఏప్రిల్ 27న ఘనంగా జరుపుతున్నట్లు కార్యదర్శి శ్రీ ఆర్. రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెహెరాబాద్ నుండి బాబా ట్రస్టు ఛైర్మన్ శ్రీధర్ కేల్కర్, ట్రస్టీ సభ్యులు శ్రీ రమేష్ జంగ్లీ, ఆయన భార్య శ్రీమతి జయశ్రీ విచ్చేసారు. కాగా శ్రీ బి. రామక్రిష్ణయ్య, డా॥ నరేంద్ర ప్రసాద్, ప్రొఫెసర్ బి. కేశవరావు బాబా సందేశాలపై ప్రసంగించారు.

ఉదయం 6.30 నుండి మధ్యాహ్నం 2 గంటల దాకా సాగిన బాబా సహవాస్ కార్యక్రమంలో అవతారుని సందేశాలపై వక్తలు చేసిన విశేష ప్రసంగం ఆహుతుల్ని ఆకట్టుకున్నాయి.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

ఈ తపన వల్లనే మండలివారు బాబా ప్రేమలో పండిపోయారు.
అది ఎన్ని జన్మల అనుబంధమో, సంస్కారమో ఎవరికి తెలుసు?
బహుశా అవాళ రమ్జూకి ఇటువంటి ఆలోచనలే వచ్చి వుండాలి.
ఎందుకంటే బాబావారు అతనిని నిలదీశారు
"మనిషివా?, పశువ్వా? నువ్వు చెప్పు" అన్నారు.
పాపం రమ్జూకి బాబావారి మాటలు అంతుపట్టలేదు.
తత్తరపాటున బిత్తరపోయాడు.
"ఏమో బాబా! మనిషినే కావచ్చు నేను" అన్నాడు
నీళ్ళు నములుతూ.
మనిషి జన్మ అంటే ఏమిటో తెలుసా అని ప్రశ్నించారు బాబా.
రమ్జూ తలాడించలేదు. పెదవి కదపలేదు.
బాబావారికేసే తేరిపారా చూస్తూ కూర్చున్నాడు.
ప్రభువు వివరణ ఇచ్చారు.
అది సోదాహరణగా చెప్పిన ప్రవచనం ఒక్క రమ్జూ కోసమే కాదు.
ఆనాటి మండలివారి కోసమూ కాదు.
మన అందరి కోసం.
మీరే గమనించండి బాబావారు ఏమి సెలవిచ్చారో!
సృష్టి క్రమంలో ఆఖరి దశ మానవ జన్మ అన్నారు.
ఇది అత్యంత ఉత్కృష్టమైన దశ అన్నారు.
ఐతే ఈ మానవ జన్మలో ఓ తిరకాసు వుందన్నారు.
పుట్టుకతోనే మానవ జన్మ ఎత్తితే పరిస్థితి మరో రకంగా వుండేది.
జంతుజాలం నుంచి మానవ జన్మకు ఎదగడం వల్ల,
మనిషిలో జంతువుల వాసనలు పుష్కలంగా వుంటాయి.
తిండి యావ తీసుకోండి.

కామ, క్రోధాది లక్షణాలు గమనించండి.
అంత ఎందుకు నరనరాలలో కనిపించే ద్వేషం గుర్తించండి.
ఇవన్నీ మనిషిలో వున్న జంతు స్వభావాలు, లక్షణాలు.
ఇవన్నీ ఎందుకున్నాయి మనిషిలో?
ఎందుకున్నాయి అంటే జంతు దశ తరువాత మనిషి పుట్టాడు కాబట్టి.
ఈ పరిణామ క్రమం వల్లనే
జంతువుల లోపాలు మనిషిలో కూడా వుంటున్నాయి అన్నారు.
మనిషిలో కేవలం జంతు ప్రభావమే వుందా?
లేదు, వీటితో పాటు కొన్ని మంచి అలవాట్లు కూడా వున్నాయి.
అవి దేవతా లక్షణాలు.
అంటే జంతు లక్షణాలు ప్రక్కనే దేవతా లక్షణాలు వున్నాయి మనిషిలో.
ఏమిటి ఆ లక్షణాలు? ఆ లక్షణాలు ఏమిటీ అంటే,
అవి దయా గుణం, కామ క్రోధాది జంతు స్వభావాల నుంచి బయటపడగల శక్తి.
మామూలుగా అందరిలో ఈ రెండు ప్రకృతులు –
అంటే జంతు ధోరణి, దేవతా శక్తి సమపాళ్ళలో వుంటాయి.
ఈ రెండింటినీ తుడిచిపెట్టాలి.
ఎందుకని?
ఇవి పూర్తిగా మనస్సు నుంచి పోతేనే బ్రహ్మైక్యానికి మార్గం రెడీ అవుతుంది.
ముందుగా పోవల్సినవి – జంతువుల ప్రకృతి, వాటి స్వభావాలు, ఉద్వేగాలు.
అప్పుడే మనిషిలో మరిన్ని దేవతా లక్షణాలు వస్తాయి.
అవికూడా పూర్తిగా తుడిచిపెట్టేశాక ఆత్మ పరమాత్మలో ఏమకమవుతుంది
అని బాబావారు శెలవిచ్చారు.
మనిషి జన్మ ఎత్తినంతమాత్రాన ప్రతివారు మనుషులుగా చలామణీ
కాలేరని స్పష్టంచేశారు.
జంతు స్వభావాలు పోవాలి, దేవతా లక్షణాలు పెరగాలి.
అప్పుడే అది నిజమైన మానవ జన్మ అవుతుంది.
అలా అని అది ఏదో సర్వోత్కృష్టమైన దశ అనుకొనేరు.
పొరపాటు. దేవతా లక్షణాలు ఎన్ని వచ్చిన,
అవి అత్యుత్తమ స్థితికి చేరినా, మనిషి పరిపూర్ణుడు కాడు.
ఎందుకో తెలుసా?
ఎందుకూ అంటే, దేవతలకి జంతు స్వభావాలు, లక్షణాలు లేకపోవచ్చు.
ఎన్నో మంచి గుణాలు వుండవచ్చు.

కాని దేవతలకి భగవత్ప్రేమ తెలీదు.
భగవంతుని ఎలా ప్రేమించాలో తెలీదు.
పరాత్పర పరబ్రహ్మ కోసం పరితపించగలిగితేనే భగవదైక్యం సంప్రాప్తించేది.
పరబ్రహ్మ కోసం తపించడం ఈ దేవతలకి చేతకాదు.
వాళ్ళకి ప్రేమ తెలీదని కాదు.
ప్రేమించడం వాళ్ళకి తెలుసు.
అది వెన్నతో పెట్టిన విధ్య.
ఈ ప్రేమ వేరు భగవంతుని దారి చేర్చగల ప్రేమ వేరు.
మరి ఆ ప్రేమ వాళ్ళకి తెలియదు కాబట్టి,
వాళ్ళలో లేదు కాబట్టి
దేవతలకి దైవ సాక్షాత్కారం దొరకదు.
ఆ వరం కావాలంటే దేవతలు మానవ జన్మ ఎత్తక తప్పదు.
ఎందుకంటే, సృష్టిలో ఒక్క మానవుడికే తెలుసు –
భగవంతుడిని ఆరాధించి, తరించడం.
భగవత్ సాక్షాత్కారం కావాలి అందరికీ.
కానీ అది మనుష్యుడిగా వుండకపోతే దొరకదు.
మనిషికే కదా పరాత్పరుని ధ్యానించి, సేవించి, తరించగల శక్తి వున్నది.
కాబట్టి భగవత్ప్రేమలో మునిగి భగవంతునిలో లీనం కావాలంటే దేవతలు
మనుష్య జన్మ ఎత్తక తప్పదు అన్నారు.
రమ్జూకి ఇప్పుడు అర్ధమయింది బాబావారు
నువ్వు మనిషివా, పశువ్వా అని ఎందుకు అడిగారో.
పరంధాముడి సేవలో నిత్యం మునిగి తేలుతున్న తనలో
పశు లక్షణాలైన కామం, క్రోధం, జుగుప్స ఇంకా పోలేదని తెలుసు.
వాటికి దూరం కావాలంటే బాబావారి సేవలో నిష్ణాతుడు కావాలి.
ఆ పరిపక్వత రావాలీ అంటే, బాబావారి దయకి పాత్రుడు కావాలి.
అది ఎప్పుడు సాధ్యమవుతుంది.
బాబావారి కరుణ తనపై పడినప్పుడు.
ఇలా ఎప్పుడు జరుగుతుంది?
ఎంత కాలం ఆగాలి!
ఈ ప్రశ్నలు రమ్జూని వుక్కిరి బిక్కిరి చేశాయి.
ఒక్క రమ్జూకే కాదు, అక్కడ బాబావారి సమక్షంలో వున్న మండలివారినందర్నీ
కూడా స్వర్గంలో దేవతల గురించి చదువుకొన్నాం.

దేవతలు భగవంతుడికి దగ్గర వారని విన్నాము.
మరి దేవతలకి కూడా భగవంతుని ప్రేమించడం రాదని బాబావారు అంటున్నారు.
ఇది ఎలా కుదురుతుంది.
పుట్టిన ప్రతివారు స్వర్గానికి వెళ్ళాలనీ దేవతల మధ్య బ్రతకాలనీ అనుకొంటారు.
మరి అటువంటి దేవతలకే భగవంతుడిని ప్రేమించడం రాదు.
వింతగా లేదూ! అనుకొన్నారు.
వుండబట్టలేక, రమ్జూ బాబావారిని అడిగేశాడు!
నా ధర్మ సందేహం తీర్చమన్నాడు.
బాబావారు ఎప్పటిలాగా చాలా ఓపికగా బదులు ఇచ్చారు.
దేవతలది సహజ ప్రేమ అన్నారు.
అమ్మ ప్రేమ ఎంత సహజంగా వుంటుందో
దేవతల ప్రేమ అంత సహజంగా వుంటుందన్నారు.
అందులో కల్మషం వుండదు అన్నారు.
పాలిచ్చి పెంచి పెద్ద చేసే తల్లి ఏమీ ఆశించదు.
నీ బాగోగులు కోరుతుంది.
నీ సుఖమే తన సుఖం అనుకొంటుంది.
నీ ఆనందమే తన ఆనందంగా భావిస్తుంది.
అవునా! కాదా! తన రక్తం పంచుకుపుట్టిన బిడ్డపై వుండే తల్లి ప్రేమ సహజ ప్రేమ.
మరి తల్లికి బిడ్డపై ప్రేమ, భగవంతుని పట్ల భక్తుని ప్రేమ ఒక్కటేనా?
ఒక్కటి కాదు కదా, రెండు వేర్వేరు కదా.
మరి దేవతల విషయంలోను యింతే.
వాళ్ళది, తల్లి ప్రేలాగా, సహజ ప్రేమ.
ఆ సమజ ప్రేమ వాళ్ళని దేముడి దగ్గరకి చేర్చదు.
బ్రహ్మైక్యం కావాలంటే దేవతలు కూడా మానవ జన్మ ఎత్తక తప్పదు
అని బాబావారు స్పష్టం చేశారు.
మరి ఇప్పుడు చెప్పు.
నువ్వు ఎవరు? మనిషివా? దున్నపోతువా? అని కొంటెగా అడిగారు.
ఈసారి రమ్జూ తడుముకోలేదు.
ఠపీమని అన్నాడు,
"నేను సగం మనిషిని సగం జంతువుని" అని.
అందరూ ఫక్కున నవ్వారు.
నవ్వుల జల్లు వెలిశాక ఎవరెవరు ఏఏ పనులు చేయాలో బాబావారు చెప్పారు.

బువాసాహెబ్, గుస్తాద్‌గారు, ఛాన్జీగారు కొండపైనే జాగారం చేయాలి.
జాగారమా?
అవును మరి జాగారమే.
ఎందుకంటే బాబావారి గది బయట కాపలా కూర్చోవడమంటే
కూర్చుని నిద్రపోవడం కాదు కదా.
నిద్రకి ఆమడ దూరంలో వుండాలికదా.
కనురెప్ప క్రిందికి పడకూడదు కదా.
మరి వాళ్ళు కొండపై జాగారం చేస్తుంటే వాళ్ళకి భోజనం ఎట్లా?
మీకు భోజనం కొండపైకే తెస్తారులేండి అని బాబావారు శెలవిచ్చారు.
మరి మిగిలినవాళ్ళు – వాళ్ళు కొండ దిగివెళ్ళి భోజనం చేయాల్సిందే.
ఇంతకీ వంటా వార్పు ఎవరు చేస్తారట?
ఆ పని పాద్రి చేస్తాడన్నారు.
భోజనం రోజూ డబ్బాలో పెట్టి, కొండపైకి పంపమన్నారు.
కొండపైకి ఎవరు తెస్తారు? ఆ పని ఛాన్జీది అన్నారు.
అంటే రాత్రి కాపలా పని చేస్తున్న మన ఛాన్జీగారికి మరో పని పడింది అన్నమాట.
నా కోసమే కాదు, రావ్‌సాహెబ్, పిల్లల కోసం కూడా భోజనం నువ్వే తీసుకురావాలి
అని బాబావారు అన్నారు. చిత్తం బాబా అన్నారు ఛాన్జీగారు.
అలా హర్వాన్ ప్రకరణానికి నాందీ ప్రస్తావన జరిగింది.
బాబావారు రోజూ ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు చెప్పేవారు.
కోర్కెల నుంచి ముక్తి ఎలా వస్తుందో ఓ రోజున వివరించారు.
మనిషికీ భగవంతుడికి తేడా ఏమిటని అడిగితే విసుక్కోలేదు.
చిరునవ్వుతో ధర్మసందేహం తీర్చారు.
ఇంకోరోజు కష్టాలు ఎందుకు వస్తాయి బాబా అని అడిగాడు ఓ మండలి పెద్దమనిషి.
ఈ సంగతే కదా నేను చెప్తున్నది ఇప్పటివరకు అని బాబావారు అనడం,
రెడ్డిగారు వచ్చారు కథ మళ్ళీ చెప్పండి అన్నట్లుంది
మనవాడి తంతు అని అందరూ అనుకోవడం,
వాళ్ళ నవ్వుకి అతగాడు తల దించుకోవడం జరిగింది.
బ్రహ్మైక్యం అంటే ఏమిటని ఒకరు అడిగారు.
భగవత్ సాక్షాత్కారం దొరికిందని ఎలా తెలుస్తుందని ఇంకొకరు ప్రశ్నించారు.
సుఖం అంటే ఏమిటని అడిగారు ఒకరు.
పరమ సుఖమంటే ఎలా ఉంటుందని చెప్పవా బాబా
అని ఇంకొకరు మనస్సులో మాట బయటపెట్టారు.

అందరి ధర్మ సందేహాలని తీర్చారు బాబా.
ఈ ప్రకారంగా హర్వాన్ ప్రస్థానానికి ఓ విశిష్టత చేకూరింది.
ఇంతకీ బాబావారు ఏమి శెలవిచ్చారనే కదా మీరు అడుగుతున్నది.
అయితే వినండి పాఠకమహాశయా బాబావారు ఉవాచని మా మాటల్లో.
కోర్కెలు రెండు రకాలు.
మంచి కోర్కెలు, చెడ్డ కోర్కెలు.
మంచివైనా, చెడ్డవైనా కోర్కెలు తెచ్చే తంటా ఒక్కటే.
అది ఏమిటి? మనిషిని కట్టిపడేస్తాయి.
మంచి కోర్కెలైతే అవి బంగారు తాడుతో కట్టేస్తాయి.
అదే కనుక చెడ్డ కోర్కెలైతే ఇనుప తాడుతో బంధింపబడతాడు మనిషి.
కాబట్టి కోర్కెలు మంచివైనా, చెడ్డవైనా మనిషికి ఒరిగేది ఒక్కటే.
కాబట్టి మనిషి కోర్కెలకి వాంఛలకీ దూరం కావాలి.
వీటి నుంచి తప్పించుకోవాలి.
సరే, మనిషిని కోర్కెలు ఎందుకు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి?
ఎందుకు చేస్తాయి అంటే,
మనిషిని ఎప్పుడూ ఏదో ఒక కోరిక పట్టి కుదిపేస్తూ ఉంటుంది.
భార్యకు ఇది కావాలి, అది చేయాలి,
పిల్లల కోసం, వాళ్ళ బాగోగుల కోసం ఏదో చేసేయాలి.
కానీ, ఎలా చేయాలి?
ఒకవేళ అనుకున్న ప్రకారం చేయలేకపోతే ఏమవుతుంది?
నలుగురిలో ఎలా బ్రతకాలి?
బ్రతుకు బాట ఎలా ఉండాలి?
ఇలా ఎన్నో, ఎన్నెన్నో ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి మిమ్మల్ని.
అవును, ఇంతకీ ఈ ఆలోచనలు ఎలా వస్తాయి? ఎందుకు వస్తాయి?
కోర్కెలు రెక్కలు విప్పుకొని ఎగిరేలా చేసేదెవరు?
ఇంకెవరు? మీ మనస్సు. కోర్కెలకు స్వస్తి చెప్పాలి.
ఆశాపాశాన్ని తెంచుకొని బయటపడాలి.
కానీ వచ్చిన చిక్కల్లా ఏమిటంటే,
కోర్కెలు, ఆశలు మనిషిని వెన్నంటి వుంటున్నాయి.
ఇవి ఉన్నంతసేపు మనిషి హాయిగా ఊపిరి పీల్చుకోలేడు.
కోర్కెలకు అతీతమయిన వ్యక్తి రాజులకే రాజుగా కాగలడు.
కానీ కోర్కెలు లేకుండా చేయడం ఎలా వీలవుతుంది?

మీకు అంతు చిక్కదీ సంగతి. కోర్కెల నుంచి బయటపడటమనండి,
కోర్కెల నుంచి స్వేచ్ఛ అనండి, ముక్తి పొందడమనండి,
జరిగితే ఇంకేముంది. జీవితం సార్ధకమవుతుంది.
కోర్కెలను దాటి వెళ్ళాలి అప్పుడే హాయిగా స్వేచ్ఛగా జీవించగలుగుతాడు మనిషి.
ఈ స్వేచ్ఛ ఇదిగో ఈ ప్రకారంగా వుంటుందని చెప్పలేరు.
అసలు ఊహకు అందదు. ఎందుకు అందదూ అంటే,
బుర్రకు ఎంత పదునుపెట్టినా అందని స్థితి అది గనుక మీరు ఊహించలేరు.
బుర్ర పనిచేస్తుంటే కోర్కెలు పుడతాయి. ఆశలు రెక్కలు కట్టుకు ఎగురుతాయి.
బుర్ర పని చేస్తున్నంతసేపూ కొత్త కోర్కెలు పుడుతూనే వుంటాయి
కాబట్టి కోర్కెలు నశించవు. కోర్కెలు నశించకపోతే, కోర్కెలు చచ్చిపోకపోతే
మనిషి గట్టున పడడు. స్వేచ్ఛ ననుభవించడు.
ఆత్మ పక్షివంటిది.
కోర్కెలు మాయమైతే, ఈ పక్షి కళ్ళు తెరుస్తుంది.
పరాత్పరుడిని కళ్ళారా తనివితీరా చూస్తుంది, తరిస్తుంది, పరమాత్మునిలో లీనమౌతుంది.
కళ్ళు తెరచిన పక్షి చూసే పరబ్రహ్మను నేనే.
కానీ దురదృష్టం కొద్దీ ఏమవుతుందీ అంటే
నేను తన కళ్ళముందే నిలబడి వున్నా ఆత్మ పక్షి నన్ను చూడలేకపోతోంది.
ఎందుకో తెలుసా? పక్షి కళ్ళకు గంతలున్నాయి కాబట్టి,
కోర్కెలే ఆ గంతలు. ఆ గంతలు పోతే,
కళ్ళు సాఫీగా తెరుచుకుంటాయి.
ఎదుటనున్న పరాత్పరుడిని చూసి తరించే అవకాశం చిక్కుతుంది.
బాబావారి మాటలు వింటున్న మండలివారి మనస్సు పరిపరివిధాల పోయింది.
బాబావారు చెప్పినట్లు కోర్కెలకి దూరమవ్వాలంటే మనోనాశ్ సిద్ధించాలి.
ఆ వరం కావాలి అంటే యుగావతారుడిని సేవించాలి.
విధేయతే తమ కవచంగా మారాలి.
ఎన్ని పరీక్షలు పెట్టినా తట్టుకుని నిలబడాలి.
కానీ ఆ శక్తిని కూడా బాబావారే ప్రసాదించాలి. జ్ఞానంతో సిద్ధించే అదృష్టం కాదిది.
పరంధాముని అనుగ్రహం వుంటే పరమానందం తప్పక లభిస్తుంది.
అవును, ఇంతకీ పరమానందం అంటే ఏమిటి?
బాబానే అడిగితే పోలే అనుకున్నారు. వీరి ధర్మ సందేహాన్ని బాబావారు తీర్చారు.
పరమానందం మాటలకి అందదు అన్నారు. సంతోషం, సుఖం, దు:ఖం
కంటే భిన్నమైందన్నారు. సంతోషమైనా, దు:ఖమైనా అదొక మానసిక స్థితి.

మనస్సుకి ఎదురయ్యే ఆనందంలో తేలిపోవడం, దు:ఖంలో
కొట్టుకుపోవడం జరుగుతాయి.
పరమానందం అలా కాదు.
భగవంతుని దయవల్ల మనోవాక్ జరిగాక సంప్రాప్తిస్తుందా వరం.
సుఖం, దు:ఖం మనస్సు వల్ల అయితే పరమానందం ఆత్మవల్ల.
మరి పరమానందం ఇదిగో ఇలా వుంటుందని చెప్పలేరు,
మాటలకి అందదు.
ఇదిగో ఫలానా చోట వుంటుందని వెతుకుతూ వెళ్ళి పట్టుకోలేరు.
అదొక నిర్వచనీయమైన స్థితి.
పరమానందాన్ని అనుభవించాలి.
ఆ ఆనందంలో తేలాలి.
అంతే అన్నారు బాబా.
బాబావారు అంటున్న ఆనందం, సంతోషం, పరమానందం బుర్రకెక్కలేదు
మన మహానుభావుడికి. ఆయన ఎవరో పేరెందుకులేండి.
రామాయణమంతా విని రాముడికి సీతమ్మవారు ఏమవుతుందని
అడిగిన పెద్దమనిషి గుర్తుకు వచ్చాడు.
అతగాడిని చూస్తుంటే మండలివారికి పాపం, అతగాడు ఎవర్నీ
పట్టించుకోలేదు సరికదా, తన చిక్కుముడిని విప్పమని బాబావారిని
వేడుకున్నాడు.
ఆత్మ, పరమాత్మ వేరు కాదు కాబట్టి, అందరూ సుఖంగా, ఆనందంగా కనిపించాలి.
కాని ఎవర్ని చూసినా సంతోషంగా, ఆనందంగా కనపడరు సరికదా,
ఎప్పుడూ బాధపడుతున్నట్లు కనిపిస్తారు.
ఎందువల్లనంటారు అని ప్రశ్నించారు.
ఔరా! ఏమి మూర్ఖత్వం ఇతగాడికి అని అందరూ ముక్కున వేలేసుకున్నారు.

–సశేషం

# తాడేపల్లిగూడెం ప్రేమిక సహవాస్

తాడేపల్లిగూడెం, సుబ్బారావుపేట సెంటర్ ఆధ్వర్యంలో మెహెర్‌స్థాన్ కొవ్వూరులో ప్రేమిక సహవాస్ 2014 మే 11న ఘనంగా జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. సప్తవర్ణ పతాకాన్ని శ్రీమతి బాలగోపాల గోవిందమ్మ అవిష్కరించారు. బాబావారి ప్రేమసందేశాలపై శ్రీమతి పద్మావతి, రమణి, ఉష తదితరులు ప్రసంగించారు.

# వెంకోబరావు
**(1921 - 2014)**



వెంకోబరావు బెంగళూరు నివాసి.
18 సంవత్సరాల వయస్సులో, 1939 డిశంబరు 22న తొలిసారిగా
బెంగళూరులో మెహెర్‌బాబాని దర్శించుకుని, ఆ క్షణం నుండీ
బాబా సేవకు అంకితమైన ధన్యజీవి శ్రీ వెంకోబరావు.
మెహెర్‌బాబాతో కాశ్మీర్ నుండి అన్నట్లు, ఆశేతు హిమాచలం
వెంకోబాజీ పర్యటించాడు.
బాబా ఆదేశాలతో మస్తుల సేవ చేశాడు.
1940-44 మధ్య కాలంలో బాబా పురుష మండలితో వెంకోబా వున్నాడు.
అవతారుని సన్నిధిలో ప్రేమ విధేయతలతో కూడిన జీవితాన్ని వెంకోబాజీ గడిపాడు.
బెంగళూరుకు సమీపంలోని భైరమంగళలో విశ్వ ఆధ్యాత్మిక కేంద్ర
నిర్మాణానికి అవతారుడు 1939 డిశంబరు 17న శంఖుస్థాపన చేశారు.
వెంకోబాజీని ఆ కేంద్రానికి కాపాలాదారుడిగా బాబానే స్వయంగా నియమించారు.
ఒక సందర్భంలో వెంకోబాజీ కోసం మెహెర్‌బాబా స్వయంగా
భైరమంగళ వచ్చి మూడ్రోజులున్నారు. అవతారుని సేవలో, ఆయన నామస్మరణలో 1939 నుండి సుమారు 75 సంవత్సరాలు గడిపిన శ్రీ వెంకోబరావు 2014 ఏప్రిల్ 12న అవతారునిలో ఐక్యమయ్యాడు. ఆ మహనీయుని గురించి నేటి తరం తప్పక తెలుసుకోవాలి. ఆయన కుమారుడు శ్రీ దేవరావు, బెంగళూరు, పంపిన సమాచారం ఆధారంగా, శ్రీ వెంకోబా గురించిన సంక్షిప్త, సమగ్ర సమాచారాన్ని
ఈ సంచికలో నివాళిగా ప్రచురిస్తున్నాం. దయచేసి పరిశీలించగలరు.

బెంగళూరుకు సమీపంలోని ఖైరమంగళలో విశ్వ ఆధ్యాత్మిక కేంద్రాన్ని
మెహెర్‌బాబా 1939 డిసెంబర్ 17న లాంఛనంగా శంకుస్థాపన చేశారు.
ఆ తరువాత బెంగళూరులో డిసెంబరు 18-30 దాకా ఉదయం 8 నుండి 9 దాకా, తిరిగి సాయంత్రం 4 నుండి 5 దాకా ప్రతిరోజూ స్థానిక ప్రజానీకానికి దర్శనం ఇచ్చారు. సరిగ్గా ఆ సమయంలో డిసెంబరు 22న వెంకోబరావు తొలిసారిగా బాబా దర్శనం చేసుకున్నాడు. ఆనాడు బాబా బెంగళూరులో ప్యాలస్‌రోడ్డు, వీధి నెం. 4లో ఉన్న పెద్ద బంగళాలో బస చేసారు.
వెంకోబరావు బెంగళూరుకు దగ్గర్లోని చిక్కనవలసే గ్రామంలో జన్మించాడు.
చిన్నతనంలో ఆయన పెద్దగా ఏమీ చదువుకోలేదు.
మూడు, నాలుగు తరగతులతో చదువుకు స్వస్తి పలికి గొర్రెల కాపరిగా జీవనం గడిపాడు. వెంకోబరావు స్నేహితుడు రత్నోజి అనేవాడు ఒకరోజున ప్రక్క ఊరిలోవారి గొర్రెను చంపి, మంచి వంటకం వడ్డించాడు. వెంకోబరావు కూడా ఆ మటన్ భోజనం చేసాడు. ఆ గొర్రెను పెద్దపులి చంపిందని ప్రచారం చేసాడు రత్నోజి.
రత్నోజి చేసిన పనికి వెంకోబరావు సాక్ష్యంగా నిలిచాడు.
ఈ విషయం ఆనోట, ఈనోట నాని, గ్రామ పంచాయితీ విచారణకు చేరింది.
గ్రామ పెద్దలు రత్నోజికి రూ. 8/- జరిమానా విధించారు.
అయితే గొర్రెపిల్లను చంపినప్పుడు వెంకోబరావు కూడా తనతో ఉన్నాడు కాబట్టి, ఆ జరిమానాలో వెంకోబ సగభాగం భరించాలని షరతు విధించాడు రత్నోజి.
వెంకోబా దగ్గర డబ్బు ఎక్కడ వుంది.
ఏం చెప్పినా రత్నోజి ఆలకించలేదు.
జరిమానా సగ భాగం కట్టాల్సిందేనన్నాడు.
విధిలేని పరిస్థితులలో వెంకోబా తన కుటుంబంలో సాకుతున్న గొర్రెను
నొకదానిని జరిమానాకు ప్రత్యామ్నాయంగా చెల్లించి రత్నోజి నోరు మూయించాడు.
వెంకోబాజీ అన్నగారికి, తండ్రికి ఈ విషయం రుచించలేదు.
వెంకోబాను తప్పుపట్టారు.
చీవాట్లు పెట్టారు.
దసరా పండుగ రోజున ఆ గొర్రెను గ్రామ దేవతకు బలి ఇవ్వాల్సినదాన్ని,
వెంకోబా దానమిచ్చేసాడని రుసరుసలాడారు.
దాంతో వెంకోబా మనస్సు గాయమైంది.
ఇదంతా 1939 నాటి మాట.
ఇల్లు వదలి వెళ్ళిపోవాలని, దసరాపండుగ లోపల ఎంతోకొంత సంపాదించి,
గొర్రెనొకదాన్ని కొని తన తండ్రికి ఇవ్వాలని నిశ్చయించుకున్నాడు.

ఏదో ఒక పనిచేసి ఎంతోకొంత డబ్బు సంపాదించి
ఆ దరిమిలానే ఇంటికొస్తానని తండ్రికి, బంధువులందరికీ చెప్పి, బెంగళూరు వెళ్తున్నానని చెప్పి ఇంట్లోంచి బయటకొచ్చేసాడు.
బెంగళూరులో రాత్రిం పగళ్ళు స్థానిక హోటళ్ళలో పనిచేసాడు.
ఆ తర్వాత తాను సంపాదించిందంతా తీసుకొని దసరా పండక్కి ఇంటికెళ్ళాడు.
తాను అన్నమాట ప్రకారం తన సంపాదనంతా తండ్రికి ఇచ్చాడు.
పండగ అయిపోయాక తిరిగి బెంగళూరు వచ్చేసి హోటలు పనిలో చేరాడు.
ఈ సమయంలో బెంగళూరులో ప్యాలెస్‌రోడ్డులో గల బంగళాలో బాబా బస చేసివున్నారు. బాబా సోదరుడు జాల్ కారు డ్రైవర్ గోపాల్‌తో వెంకోబరావు స్నేహితుడు నరసింహ ద్వారా పరిచయమవుతుంది.
వెంకోబాకు ఏదైనా పని ఇప్పించమని నరసింహ జాల్‌భాయ్ డ్రైవర్ గోపాల్‌ను కోరతాడు.
ఆ తర్వాత అతను వెంకోబాను జాల్‌భాయ్‌కి పరిచయం చేసాడు.
వెంకోబా హిందీ, మరాఠీ కూడా మాట్లాడగలడు.
ఖైరమంగళ దగ్గర నిర్మిస్తున్న ఆధ్యాత్మిక కేంద్రంలో త్వరలో ఏదైనా ఉద్యోగం ఇప్పిస్తాను.
నీవు ప్రస్తుతం పనిచేస్తున్న హోటలులోనే పనిచేసుకోమని జాల్‌భాయ్ సలహా ఇచ్చాడు.
బాబా బెంగళూరులో పర్యటన, ఖైరమంగళ కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను పంచిపెట్టే పనిని జాల్‌భాయ్ వెంకోబాకు అప్పజెప్పాడు.
ఆ పనిని ఎంతో జాగ్రత్తగా నిర్వహించాడు వెంకోబా.
ఆ తర్వాత ఖైరమంగళ శంఖుస్థాపన కార్యక్రమానికి వెంకోబా హాజరుకాలేదు.
ఖైరమంగళలో బాబా కార్యక్రమమం అయిపోయాక, నా పని సంగతి ఏమిటని వెంకోబా గోపాల్‌ని అడిగాడు. ఇంతటితో నా పని అయిపోయినట్లేనా? అని అమాయకంగా అడిగాడు. త్వరలో మెహెర్‌బాబా ప్యాలెస్ రోడ్డులో ప్రజా దర్శనం ఇస్తారు.
ఆ సమయంలో నీవే మెహెర్‌బాబాని నీ పని గురించి అడిగి తెలుసుకో అని గోపాల్ సలహాయిచ్చాడు. బెంగళూరులో బాబా ప్రజాదర్శనం ఇస్తుంటే డిసెంబరు 22న వెంకోబా క్యూలో నిలుచున్నాడు. బాబా దర్శనం చేసుకొని బయటకు వచ్చేశాడు. బాబా ఏమీ మాట్లాడలేదు.
ఈ విషయాన్నే బాధతో వెంకోబా గోపాల్‌తో చెప్పాడు.
ఆ మర్నాడు మళ్ళీ వెళ్ళి బాబా పాదాలపై ప్రణమిల్లి నీ సంగతి బాబాకు చెప్పు అని గోపాల్ తిరిగి సలహా ఇచ్చాడు.
వెంకోబా మర్నాడు తిరిగి బాబా దర్శనం క్యూలో నిలుచున్నాడు.

ఆ రోజు బాబా ప్రక్కనే జాల్‌భాయ్ కూడా వున్నాడు.
వెంకోబా తన దర్శన సమయం రాగానే బాబా పాదాలపై సాష్టాంగ ప్రణామం చేసాడు. ఈతను ఎవరని బాబా జాల్‌ని ప్రశ్నించారు..
జాల్ వెంకోబా గురించి తనకు తెలిసినదంతా బాబాతో చెప్పాడు.
ఈతను నీతో రావాలనుకుంటున్నాడన్నాడు.
ఆశ్చర్యంగా బాబా అంతా విని,
నీవు నాతోపాటు రావడానికి ఇష్టమేనా అని అడిగాడు.
ఆ క్షణాన వెంకోబా ఆనందానికి హద్దులేదు. 'వస్తాను బాబా' అని ఆనందంగా జవాబిచ్చాడు. వెంకోబాను కొద్దిసేపు బయట వేచి వుండమన్నారు బాబా.
దర్శన కార్యక్రమం అయిపోయాక బాబా బయటకు వచ్చి తన కారులో ముందు సీటులో కూర్చుని, వెంకోబాను వెనుక సీటులో కూర్చోమన్నారు.
బెంగళూరులో **'ది లింక్స్'** అనే ప్రాంతంలో నిర్వహించిన మస్తుల ఆశ్రమానికి బాబా తనతో వెంకోబరావుని తీసుకెళ్ళారు.
వెంకోబాకు దుస్తులు, చెప్పులు, ఇలా అతనికి కనీస అవసరాలన్నింటినీ సమకూర్చారు.
మస్తులకు సహాయకుడిగా పనిచేయాలని ఆదేశించారు.
అక్కడ మూడు రోజులు పని చేసేసరికి వెంకోబాకు మొహం మొత్తినట్లయింది.
అక్కడ అందరూ మస్తులు. పిచ్చివాళ్ళలా తోచింది వెంకోబాకు.
మూడు రోజులు అయ్యేసరికి తను అక్కడ పని చేయలేననుకున్నాడు.
ఈ మాటనే తన స్నేహితుడు నరసింహాతో అంటే, ఒకట్రెండ్రోజులు ఓపిక పట్టమని సలహా ఇచ్చాడతను. వెంకోబాకు పెద్ద చదువులేదు. డబ్బులేదు.
కాని క్రమశిక్షణ, నిజాయితీలు మెండుగా వున్నాయి.
శిష్యుడు సిద్ధంగా వుంటే గురువు వెంటనే వస్తాడని సంత్ కబీర్ చెప్పినట్లు, అవతారుడు వెంకోబాను తన శిష్య గణంలో మండలి సభ్యునిగా చేర్చుకున్నారు.

## 1940–44 మధ్య కాలంలో

బాబా పురుషమండలితోనే వెంకోబా వున్నాడు. అవతారుని సన్నిధిలో ప్రేమ విధేయతలతో కూడిన వెంకోబా జీవితం నేటి తరం యువతకు ఆదర్శం కావాలి.
ఆ మర్నాడు రాత్రి 8 గంటల ప్రాంతంలో బాబా వెంకోబాతో పాటు మరో నలుగురిని తన గదికి పిలిపించారు. వెంకోబా తన మనస్సులో బాధ ఎలా చెప్పుకోవాలోనని ఆలోచిస్తున్నాడు. ఆ సమయంలోనే బాబా వెంకోబాని దగ్గరగా పిలిచి తన పాదాలు పట్టమన్నారు. అలా బాబా కాళ్ళు పడుతూ, అవతారుని దివ్య దర్శన భాగ్యం పొందాడు. భగవంతుని పాదాలు పట్టే అరుదైన భాగ్యం లభించిందని తెలుసుకున్నాడు వెంకోబా.

తన జీవితాంతం బాబా పాదాల చెంత అంకితమవ్వాలని
ఆ క్షణంలోనే నిశ్చయించుకున్నాడు. వెంకోబారావుతో పాటు
కృష్ణ, కాలప్ప, రాజు, అంబూ మొత్తం ఐదుగురు బెంగళూరులో బాబాతో పాటు
వున్నారు. బాబా బెంగళూరు నుండి మెహెరాబాదుకు వెళ్ళేముందు
వీరందరినీ పిలిచి మీరు నాతో వస్తారా? లేదా
మీ పనులకు మీరు వెళ్తారా? అని అడిగారు.
బాబా వెంకోబరావుని అదే ప్రశ్న అడగ్గానే – నేను నీతో వస్తాను బాబా అని
జవాబిచ్చాడు. నీవు నాతో వచ్చేలాగైతే నా దగ్గర సెలవులు, సరైన తీరిక
వుండదు. నాతో నూటికి నూరుశాతం విధేయతతో వుండాలి.
ఒకచోట నుండి మరోచోటకు నాతో ప్రయాణించవలసి వుంటుంది.
సమయానికి తిండి, నిద్ర వుండవు.
బాగా ఆలోచించుకొని చెప్పమన్నారు వెంకోబాని.
అయినాసరే వస్తానని స్థిరంగా జవాబిచ్చాడు వెంకోబా.
రెండ్రోజులు సెలవిచ్చారు.
ఇంటికెళ్ళి అన్ని సర్దుబాట్లు చేసుకొని రమ్మనమన్నారు బాబా.
వెంకోబా తన గ్రామం వెళ్ళి, తల్లిదండ్రులతో అన్ని విషయాలు చెప్పాడు.
బాబా దగ్గరకు వెళ్తున్నానని చెప్పాడు. వాళ్ళను చూడటానికి సంవత్సరానికి
ఒకసారి వస్తానన్నాడు. 1940 ఏప్రిల్ 1న బాబా బెంగళూరును వదలి,
మెహెరాబాదుకు మే 3కి చేరారు. ఈ మధ్యకాలంలో కర్ణాటకలోని పలు ప్రాంతాలతో
పాటు గోవా – మహారాష్ట్రలలో బాబా పర్యటించారు.
1940 ఏప్రిల్ 26న బాబా పంచగనిలో వున్నారు. బాబా పంచగనిలో వున్న సమయంలో
వెంకోబరావుకు మండలి సభ్యుడు ఏరుచ్‌తో టెలిగ్రాం పంపారు.
ఆ వెనువెంటనే వెంకోబరావు బెంగళూరులో బయలుదేరి పూనే చేరుకొని అక్కడినుంచి
పంచగనిలో బాబా దగ్గరకు వెళ్ళాడు. వెంకోబాని చూస్తూనే క్షేమ సమాచారాలు
అడిగి తెలుసుకున్నారు బాబా. ఆ రాత్రి బాబా గదిలోనే వెంకోబా పడుకున్నాడు.
బాబా మంచంపై పడుకోగా, అదే గదిలో వెంకోబా క్రింద పడుకున్నాడు.
ఆ మర్నాడు వెంకోబాని మెహెరాబాద్‌కు వెళ్ళమన్నారు.
ఒక వారం రోజుల్లో తానూ మెహెరాబాద్‌కు వస్తున్నానని చెప్పారు.
మెహెరాబాద్‌లో వెంకోబాకు అప్పగించిన పని ఏమంటే బాబా గదికి
రాత్రి కాపలాదారుడిగా వుండటం.
మస్తుల బాగోగులు చూస్తూ,
వారి పరిసరాలు పరిశుభ్రంగా వుంచే బాధ్యతను బాబా అప్పగించారు.

## మీకేం కావాలి!

1940 జూలై నెలలో బెంగళూరు నుండి వచ్చిన ఈ ఐదుగురిని బాబా పిలిపించి మీకేం కావాలి? మీరేం చేయాలనుకుంటున్నారు? మీరు ఏది అడిగితే దాన్ని నేను ఇవ్వడానికి సిద్ధంగా వున్నాను. కోరుకోండి? అని బాబా అభయమిచ్చారు.
రాజు అనే కుర్రాడు వ్యవసాయం చేసుకుంటానన్నాడు.
కాలప్ప వంటనూనె వ్యాపారం చేస్తానన్నాడు.
అంబూ – టాంగా నడుపుతానన్నాడు.
వెంకోబా – ఏదైనా చిన్న వ్యాపారం చేయాలని వుందన్నాడు.
**కృష్ణనాయర్ – బాబా నీవే కావాలి!!** నీ దగ్గరే వుంటానన్నాడు.
బాగా ఆలోచించుకో!! నా దగ్గర ఉండటం అంత సులభంకాదన్నారు.
నన్ను కోరుకోవడం ద్వారా గోతిలో పడ్డట్లేనన్నారు బాబా.
ఏదైతేనేమి నీవు కోరింది మంజూరు చేస్తున్నానన్నారు బాబా.
వెంకోబరావును కొద్దిరోజులు ఆగమన్నారు.
మిగిలిన ముగ్గురికి వారుకోరిన విధంగా ఇచ్చి వారి గ్రామాలకు పంపివేశారు.
వారు కోరిన రంగంలో ఆ ముగ్గురు బాగా అభివృద్ధిలోకి వచ్చారు.
వెంకోబరావు బాబాతో అనేక ప్రదేశాలు పర్యటించాడు.
బాబాతోపాటు రాంచీ, సిలోన్, కాలికట్, పంచగని, జైపూర్, ఆగ్రా, ఢిల్లీ, అంబాలా, లాహోర్, ముల్తాన్, క్వెట్టా, ఇలా అనేక ప్రాంతాలు సందర్శించాడు.
బాబా బస చేసిన గది బయట వెంకోబా చాలా కాలం నైట్ వాచ్‌మన్‌గా వున్నాడు.
అది 1942 అక్టోబర్ నెల. లోనావాలాలో బాబా ఏకాంతవాసంలో వున్నారు.
ఒకరోజున రాత్రి కాపలాకు వెంకోబాతో పాటు కృష్ణనాయర్ కూడా డ్యూటీలో వున్నాడు.
బాబా కృష్ణనాయర్‌ని పిలిచారు. బయట వెంకోబా మెళుకువగా వున్నాడో చూడమన్నారు.
సరేనని బయటకెళ్ళి చూస్తే ఏముంది, వెంకోబా గాఢ నిద్రలో వున్నాడు.
అతని ప్రక్కనే పెద్దపాము వుంది. ఆదమరిచితే ఏ సమయంలోనైనా పాము కాటేయగలదు. ఇది చూసిన కృష్ణనాయర్ పెద్ద కర్ర తీసుకుని పాముని చంపి వెంకోబాను కాపాడాడు. ఆ తర్వాత బాబా వెంకోబాపై కోప్పడుతూ, జాగ్రత్తగా వుండు మరోసారి ఇలా జరిగితే నేను నిన్ను కాపాడనన్నారు.

## మహాబలేశ్వర్‌లో

1943 ఫిబ్రవరి – జూన్ నెలలో వెంకోబా – కృష్ణనాయర్‌లు ఇద్దరూ బాబాతోపాటు మహాబలేశ్వర్‌లో వున్నారు. బాబా ఏకాంతవాసంలో వున్నారు.
ఆ సమయంలో ఒక రోజున బాబా కోపంతో కృష్ణనాయర్ చెంపను చెళ్ళుమనిపించారు.

ఆ తర్వాత వెంకోబా – కృష్ణనాయర్‌లను ఇద్దరినీ పిలిచారు.
ఏకాంతవాస నియమాలకు విరుద్ధంగా నిన్ను కొట్టాను.
కాబట్టి, అందుకు పరిహారంగా మీరు ఇద్దరూ ఒకరితర్వాత ఒకరు వచ్చి
నా చెవి మెలిపెట్టమన్నారు. అవతారుని ఆజ్ఞ.
బాబా చెప్పినట్లు విధేయతతో బాబా ఆదేశాలను పాటించారు.
ఆ తర్వాత మండలివారందరినీ బాబా పిలిచి,
చూడండి! వీళ్ళిద్దరూ ఇటీవలనే నా దగ్గరకు వచ్చారు.
ఎంతో విధేయతతో నేను చెప్పినట్లు నాకు శిక్ష అమలు చేశారు.
మీరెంతో కాలంగా నాదగ్గరనే వుంటున్నా, మీలో ఆ విధేయత లేదని
చమత్కరించారు బాబా.
వెంకోబా – కృష్ణనాయర్‌లు ఇద్దరినీ – మండలివారు, సేవకులుగా, జీతగాళ్ళు మాదిరి
చూసేవారు. నెలనెలా జీతం తీసుకుని సేవచేస్తున్నారనేవారు.
ఒకరోజున వీరిద్దరూ బాబా ఎదుట,
మాకు నెల జీతం వద్దు. కేవలం ప్రేమతో నీ సేవ చేసుకునే భాగ్యం కల్పించు బాబా
అని వేడుకున్నారు. బాబా నవ్వుతూ, మీకిచ్చే జీతాన్ని మీ గ్రామంలో
మీ ఇంటి ఖర్చులకు పంపండి అని ప్రేమతో ఆదరించారు.

## చదువు రానివాడిని

ఒకరోజున బాబాతో, నేను చదువురానివాడిని బాబా అన్నాడు వెంకోబా.
నీ గురించి రాసిన పుస్తకాలు, సందేశాలు చదవలేను అని వాపోయాడు.
దాంతో బాబా నీవు ఎందరికంటేనో అదృష్టవంతుడివి.
నాపట్ల విధేయతతో వుండే నీవు ఎందరో చదువుకున్న వారికంటే గొప్పవాడివి అన్నారు.
పెద్ద చదువులు చదివినవారిలో వుండే సంశయాలు – ఆలోచనలూ – నాపట్ల
నీకేమీ లేవు. ఆ మాదిరిగా నీవు ఎంతో గొప్ప వాడివని బాబా వెంకోబాకు కితాబిచ్చారు.
ఇకపై చదువురానివాడినని దిగులు పడొద్దని బాబా భరోసా ఇచ్చారు.

## పెద్ద పులుల సంచారం

మహాబలేశ్వర్‌లో పెద్ద పులుల సంచారం గల అటవీ ప్రాంతంలో బాబా
ఏకాంతవాసంలో వున్నారు. బాబా గది బయట కృష్ణనాయర్, వెంకోబరావులు
కాపలా వున్నారు. “ఒక రోజు అర్ధరాత్రి పూట ఒక పులి వెంటాడుతుంటే పిల్లి పిల్ల
ధభీలుమని మేమున్న చోటకు వచ్చింది.
అలా దాన్ని వేటాడుతూ వచ్చిన పులి మాకు ఓ 20 అడుగుల దూరంలో ఆగిపోయింది.
కృష్ణ నాయర్ ధైర్యం చేసి దాని కళ్ళలో టార్చ్‌లైట్‌ని వేశాడు.

ఐతే, ఆ పులి కళ్ళు తిప్పేసుకుని చాలాసేపు అలాగే అక్కడ్నుంచి కదలకుండా ఉంది. ఆ తర్వాత అడవిలోకి వెళ్ళిపోయింది. ఈ సంఘటన తలుచుకుంటేనే చాలాకాలం భయంతో వణికిపోయాం. బాబాకు ఈ విషయం చెబితే, ఆ మర్నాటి నుండి తన గదిలోనే ఉండమని ఆదేశించారు.

## హరినారాయణ భగవాన్

ఒక సందర్భంలో పంచగనిలో బాబాతో వెంకోబరావు ఒంటరిగా వున్నాడు. ఆ సమయంలో "హరినారాయణ భగవాన్" నామాన్ని జపించమని బాబా ఆదేశించారు. ఇది గురువు ఇచ్చిన మంత్రం అంటారు ఆయన సమకాలీనులు.

## వెంకోబరావు వివాహం

బాబాతో పాటు బ్లూబస్ పర్యటనలో వెంకోబరావు వున్నారని తెలుసుకున్నాం కదా! బాబా కాశ్మీర్ పర్యటనకు వెళ్ళే ముందు వెంకోబరావుకి కొన్ని రోజులు సెలవు మంజూరు చేశారు. అప్పటికే వెంకోబరావు సోదరి వివాహం అయింది.
ఆయన బావ గారి చెల్లెలు వివాహానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు.
ఐతే, ఏదో మాట పట్టింపుల వల్ల జరగాల్సిన పెళ్ళి మధ్యలోనే ఆగిపోయింది.
వెంకోబా స్వగ్రామంలో వున్నాడు కదా, అందరూ ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకొమ్మనమని వెంకోబరావుని బలవంతం చేశారు.
ఈ విషయంపై బాబా అనుమతి కోసం వెంకోబరావు ఉత్తరం రాస్తే,
బాబా అనుమతి ఇస్తూ, వివాహం చేసుకుని ఆ వెనువెంటనే మెహెరాబాద్‌కు రమ్మనమని ఆదేశించారు. ఆ మాదిరిగా వివాహం చేసుకుని వెంకోబరావు ఒంటరిగా మెహెరాబాద్ వెళ్ళాడు. ఆ తర్వాత బాబా మండలి బృందంతో కల్సి కాశ్మీర్ వెళ్ళాడు.
1944 ఆగస్టులో బాబా కార్యదర్శి దాదా ఛాంజీ తుదిశ్వాస విడిచాడు.
అతని మరణం బాబా మండలివారందరికీ తీరనిలోటు.
అతని మరణానంతరం ఛాంజీకి సంబంధించిన అనేక వస్తువులను
బాబా వెంకోబాకు, కృష్ణనాయర్‌లకు వాడుకోవడానికి ఇచ్చారు.
1944 డిసెంబరులో వెంకోబరావు తన భార్యను మెహెరాబాద్‌కు తీసుకురావడానికి అనుమతి ఇచ్చారు. అందుకోసం ప్రత్యేకంగా సెలవు ఇచ్చారు.
వచ్చాక ఆమె స్త్రీ మండలితో ఒక వారంరోజులు వున్నదామె.
ఆ తర్వాత బాబా వెంకోబరావుని పిలిచి, ఇక్కడ మండలివారందరూ పెళ్ళిళ్ళు చేసుకొనని బ్రహ్మచారులు. అలాగే, స్త్రీ మండలి కూడా.
నీవు పెళ్ళి చేసుకుని వీరందరి మధ్య వుండటం మీకు కష్టం.
కాబట్టి, నీవు స్వగ్రామం వెళ్ళి భార్యతో కలిసి వుండటం బాగుంటుందన్నారు.

ఒక ఆరు నెలలు భార్యతో కలిసి నీ స్వగ్రామంలో వుండు.
మరో ఆరు నెలలు నాతో వుండమని బాబా చమత్కరించారు.
ప్రతి నెలా ఖర్చుల కోసం తగిన డబ్బు పంపిస్తానన్నారు బాబా.
ఖైరమంగళాలో వున్న ఆస్తిపాస్తులు చూస్తూవుండమన్నారు.
ఖైరమంగళ పవిత్రతను పరిరక్షించమనీ అన్నారు.
ఆ మాదిరిగా ఖైరమంగళ వ్యవహారాలను అప్పజెప్తూ,
1944 డిసెంబరులో వెంకోబరావుని మెహెరాబాద్ నుండి బాబా పంపారు.
అలాగే, టీ, కాఫీలు త్రాగొద్దన్నారు. పాలు తీసుకోమని బాబా ఆదేశించారు.
ఖైరమంగళలో వెంకోబరావు భార్యతో కల్సి ఒక చిన్న గదిలో వున్నాడు.
నెలకు రూ. 50/- చొప్పున బాబా ఖర్చుల కోసం పంపేవారు.
అంతక్రితం దాకా ఒక ముస్లిం వృద్ధుడు ఖైరమంగళలో వాచ్‌మెన్‌గా వున్నాడు.
1949 లో బాబా నవజీవనంలోకి ప్రవేశించే ముందర ఆయన పేరు మీద గల
చర స్థిరాస్థులన్నింటినీ అమ్మివేసిన సంగతి పాఠకులకు తెలుసు.
ఖైరమంగళలో గల ఆస్థిపాస్థుల్ని ఏరుచ్ తండ్రి పాపాజెస్సావాలా పేరున
బదిలీ చేశారు. ఆయన బెంగళూరు వచ్చి ఈ ఆస్థిని అమ్మివేయ్యాలన్న
బాబావారి అభిప్రాయాన్ని వెంకోబరావుకు తెలియచేశాడు.
వెంకోబరావు కొంత స్థలం కొనుగోలు చేయాలని భావించాడు.
అలాంటి ఆలోచన కూడా అవతారుడే ఆయనను కల్పించి వుంటాడు.
మొత్తం ఖైరమంగళ స్థలం 574 ఎకరాలు.
బాబా అనుమతితో 55 ఎకరాలు రూ. 6500/- కి వెంకోబరావు కొనుగోలు చేశాడు.
ఈ 55 ఎకరాల లోపలనే ఆనాడు నిర్మించిన పవిత్ర భవనాలు వున్నాయి.
బాబా నవజీవనంలో అడుగుపెట్టారు.
1949 అక్టోబరు 16 నుండి వెంకోబరావు ఖైరమంగళలో క్రొత్తజీవితాన్ని మొదలుపెట్టాడు.

## బాబా చివరిసారిగా ఖైరమంగళకు

చివరిసారిగా బాబా ఖైరమంగళకు ఎప్పుడు వచ్చారని ఇతమిద్ధంగా సరైన
తేదీలు లేవని మండలి సభ్యులు అంటున్నా, 1954 అక్టోబరులో సతారాలో ప్రజాదర్శన
కార్యక్రమం తర్వాత బాబా ఖైరమంగళ వచ్చారని వెంకోబరావు కథనం.
సతారాలో ప్రజా దర్శనం పూర్తయిన వెంటనే బాబా మైసూరు వెళ్ళాలని బయల్దేరారు.
దసరా పండుగ రోజులవి. బాబాతోపాటు ఏరుచ్, పెండూ, బైదుల్ -
తదితర మండలి సభ్యులూ వున్నారు.
దసరా పండుగ వేడుకలు మైసూర్‌లో ఎంతో వేడుకగా జరుపుతారు కదా!!

ఆ పండుగ వైభవం ఏమోకానీ, మైసూర్‌లో బాబాకు ప్రశాంతత కరువయ్యిందని వెంటనే ఆ ప్రాంతాన్ని వదలి వెళ్ళిపోవాలని నిర్ణయించారు.
ఎక్కడకి వెళ్దామని మండలివారి సలహా అడిగారు బాబా.
భైరమంగళ సరైన ప్రదేశమని వారు సూచించారు. బాబా కూడా వెంటనే ఈ ప్రతిపాదనకు అంగీకరించి, ముందస్తు ఏర్పాట్లు చేయడం కోసం పెండూని ముందుగా భైరమంగళకు పంపారు. బాబా ఏడు రోజులు భైరమంగళలో వుంటారు.
వెంకోబా తగిన ఏర్పాట్లు చేయగలడా? అని కబురు పంపారు బాబా.
ఆ మాదిరి పెండూ అందరికంటే ముందుగా వచ్చి, వెంకోబాను కలిసి బాబా రాక గురించి తెలియజేశాడు. అప్పట్లో వెంకోబరావు కుమారుడు దేవరావు వయస్సు ఐదారేళ్ళు వుంటుంది. వెంకోబరావు ఆనందానికి హద్దులు లేవు.
బాబా రాక కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఎదురుచూడనారంభించాడు.
బాబా ఆ మర్నాడు వచ్చారు. అప్పటికే భైరమంగళలోని గదులన్నింటినీ పరిశుభ్రంగా వుంచి తెల్లని సున్నం వేశాడు. వారికి కావల్సిన సరంజామా అంతా తెచ్చి వుంచాడు.
బాబా మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వచ్చారు. ఆయన వస్తూనే నేరుగా తన గదిలోకి వెళ్ళారు. ఆ తర్వాత సతారాలో ప్రజాదర్శనం ఇస్తుంటే నీవు ఎందుకు రాలేదని వెంకోబాను బాబా అడిగారు. నాకు తెలియదు బాబా అని జవాబు ఇచ్చాడు. అయినా నీ అనుమతి లేకుండా నేను రాలేను కదా! అని తన నిస్సహాయతను బాబాతో వెలిబుచ్చాడు. ఈ మాటలు విని బాబా సంతోషించారు.
**"నీవు రాలేదు కనుకనే నేను ఇక్కడకు వచ్చానని"** బాబా అన్నారు.
ఈ మాటలు మండలివారిని ఆశ్చర్యపరిచాయి. భైరమంగళలోని అన్ని గదులు కలియతిరిగారు. ఆ చుట్టుప్రక్కల గల పలు ప్రదేశాలను బాబా సందర్శించారు.
బాబాకు తన రెండవ కుమారుడు దేవరావును వెంకోబా పరిచయం చేశాడు.
వారంరోజులు వుంటానన్న బాబా మూడురోజులు కాగానే బయల్దేరి వెళ్ళిపోతానన్నారు.
వెంకోబరావు మరో రెండ్రోజులు ఉండమని బ్రతిమలాడినా, బాబా సున్నితంగా తిరస్కరించారు. తాను వచ్చిన పని పూర్తయిందన్నారు.
వెంకోబరావు ఇంటిని అవతారుడు వెతుక్కుంటూ వచ్చాడు.

**విధేయత:**

బాబా "విధేయత"కు ఇచ్చే ప్రాధాన్యత గురించి వెంకోబరావు ఒక చక్కని సంఘటన వివరించారు. దీంతో ఈ శీర్షికను ముగిద్దాం!!
1954లో బాబా భైరమంగళ వచ్చారు కదా!!
ఆ సమయంలో వెంకోబరావు తన మనస్సులో మాట బాబా ఎదుట చెప్పారు.
అదేమంటే – అన్నీ వదలిపెట్టి నీ చెంత వుండాలని వుంది అని వెంకోబా చెప్పాడు.

కొద్దిరోజులు ఆగు. నేను కబురు పంపినప్పుడు వెంటనే బయల్దేరి రమ్మని అన్నారు.
ఫిబ్రవరి 1955 లో వెంకోబాకు బాబా నుండి ఉత్తరం వచ్చింది.
బాబా సతారాలో వున్నారు. వెంటనే వెంకోబాను అక్కడకు
రమ్మనమన్నారు. అదీ ఆ లేఖసారాంశం. ఈ కబురుతో వెంకోబరావు
ఆనందంతో తబ్బిబ్బయ్యాడు. వెంటనే బయల్దేరడానికి సిద్ధమయ్యాడు.
బెంగళూరు దగ్గర్లోనే వున్న 'మగడి' అనే గ్రామంలో వున్న తన అత్తవారింటికి వెళ్ళాడు.
తన భార్యను, ఇద్దరు కొడుకులను మామగారింట దించాడు.
తాను మెహెర్‌బాబా ఆశ్రమానికి వెళ్తున్నానని చెప్పాడు.
తాను వచ్చేదాకా తన కుటుంబ సభ్యుల బాగోగులు చూసుకోమని కోరాడు.
వెంకోబా బావమరిదికి బాబా అంటే గిట్టదు.
ఏదో ఒక రోజున బాబా మోజులో తన చెల్లెలికి అన్యాయం చేస్తాడేమోనని అనుమానంతో
వుండేవాడు. వెంకోబా మామగారు కూడా సతార ప్రయాణం వాయిదా వేసుకోరాదా?
అని సర్దిచెప్పబోయాడు వెంకోబాకు. "నా భార్య పిల్లల పోషణ మీకు కష్టమైతే చెప్పండి,
మరో దారి వెతుక్కుంటాను. నా ప్రయాణం ఆపే ప్రయత్నం మాత్రం చేయకండి.
నేను బాబా దగ్గరకు వెళ్తున్నాను అని ఖరాఖండీగా చెప్పాడు.
దాంతో అత్తారింట అందరూ అవాక్కయ్యారు.
వెంకోబా సతారా చేరుకోగానే, నేరుగా బాబాను దర్శించుకున్నాడు.
బాబా కుశల ప్రశ్నలు వేశారు. ఇంటి దగ్గర అందరి క్షేమ సమాచారాలు
అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత సీరియస్‌గా, నీ విక్కడ నాతో సుమారు ఏడాదిపాటు
ఉండాలి. నీ భార్య పిల్లలందర్నీ మరచిపోవాలి. వారితో ఉత్తర ప్రత్యుత్తరాలూ
ఉండరాదు. ఈ సమయంలో కుటుంబసభ్యుల్లో ఎవరినీ నీవు చూడరాదు.
వారి గురించిన ఆలోచనలు కూడా నీ మదిలోకి రారాదు అన్నారు బాబా.
ఈ నియమ నిబంధనలన్నింటినీ వెంకోబా అంగీకరించాడు.
అంతేకాదు. బాబా మరో అడుగు ముందుకేసి, ఈ నియమాలను తు.చ. తప్పక
పాటిస్తానని లిఖిత పూర్వకంగా కాగితంపై రాసి, చేవ్రాలు చేయమన్నారు.
వెంకోబా అలాగే చేశాడు. వెంకోబాకు రాత్రి డ్యూటీ ఇచ్చారు.
రాత్రి 9 నుండి తెల్లవారుఝామున 5 గంటల దాకా బాబా గది బయట వెంకోబా
వాచ్‌మన్‌గా వుండాలి. ఆ సమయంలో కృష్ణనాయర్ లేడు.
అతని స్థానంలో బైదుల్‌ని ఏర్పాటుచేశారు.
అలా ఒక వారంరోజులు గడిచింది.
ఒకరోజున పిల్లలు తమ భుజాలకు బ్యాగులతో
బిలబిలా అల్లరి చేస్తూ వారి స్కూళ్ళకు వెళ్తున్నారు. వాళ్ళను చూస్తూనే వెంకోబాకు తన

చిన్నారి పిల్లలు గుర్తుకొచ్చారు. అంతలోనే బాబా పిలిచారు.
ఏమి ఆలోచిస్తున్నావ్! అని అడిగారు.
మనస్సులో మాట నిజాయితీగా ఉన్నది ఉన్నట్లు బాబా ఎదుట చెప్పాడు.
బాబా ముఖంలో కోపం కనిపించింది.
ఇక్కడ వుండి ఇంటి దగ్గర జరుగుతున్న విషయాలు ఆలోచిస్తున్నావా? అన్నారు.
అలాంటప్పుడు నా దగ్గర వుండి ఏం లాభం? అన్నారు.
ఆ సమయంలో బాబా ప్రక్కనే మండలి సభ్యుడు పెండూ వున్నాడు.
బాబా మాటలు ఆలకిస్తూ, ఏదో సర్ధిచెప్పబోయాడు.
మేం చాలాకాలం క్రితమే మా కుటుంబాలను వదలిపెట్టి నీ దగ్గరకు వచ్చాం.
అప్పుడప్పుడు మా వాళ్ళు గుర్తుకొస్తుంటారు. వెంకోబా పెళ్ళయినవాడు.
ఇద్దరు పిల్లలున్నవాడు. యధాలాపంగా తన పిల్లల గురించి ఆలోచించడంలో
తప్పేముంది బాబా? అని పాద్రీ అన్నాడు.
పాద్రీ మాటలతో బాబా మరింత కోపంతో – "నేను నిన్ను అడగలేదు."
ఇది నీకు సంబంధించిన విషయం కాదు. నోరు మూసుకోవడం ఉత్తమం!!
అని హెచ్చరించారు. ఈ చిన్న విషయమై బాబాకు ఎందుకో
చాలా కోపం వచ్చింది. కొన్ని క్షణాలు ఆగాక ఏం బాధపడొద్దు.
నీవు మీ ఇంటికెళ్ళు! నా ప్రేమ నీకు ఎప్పుడూ వుంటుంది అని భరోసా ఇచ్చారు.
బాబా ఆదేశాలను పాటించడం మినహా వెంకోబాకు మరో మార్గం లేదు.
బెంగళూరు తిరిగి వెళ్ళాడు. అక్కడ వారి బంధువుల పెళ్ళి జరుగుతుంటే హాజరయ్యాడు.
ఆ పెళ్ళిలోనే మామ గారిని కూడా కలుసుకున్నాడు.
అల్లుడ్ని చూసి మామ ఎంతో సంతోషించాడు.
ఆ తర్వాత అత్తారింటికి వెళ్ళి ఆ మర్నాడు భార్యా పిల్లల్ని తనతో తోడుకుని
ఖైరమంగళ చేరుకున్నాడు. ఇదంతా జరిగిన సరిగ్గా వారం రోజులకి
మహాశివరాత్రి నాడు మామగారు స్వల్ప అనారోగ్యంతో తుదిశ్వాస విడిచాడు.
బాబా ఎందుకు తనను వెంటాడి స్వగ్రామానికి పంపివేశాడో
ఆ తర్వాత వెంకోబాకు అర్ధమయ్యింది. తాను బాబాతోనే వుండివుంటే మామ గారి
ఆఖరి చూపు దక్కేది కాదు. బావమరిదికి తాను బాబాతో ఉండటం ఇష్టంలేని కారణంగా
భార్యాపిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవల్సివచ్చేది. అవతారుడు ఏదిచేసినా,
మన మేలు కోరి చేస్తాడు. ముందుగా బాబా ఇలా ఎందుకు చేశాడో కదా –
అని నిష్ఠూరంగా అనుకుంటాం. ఆ మాయ తెర తొలగిపోయాక అంతా స్పష్టంగా
అర్ధమవుతుందని, వెంకోబాజీ పలుమార్లు చెప్పేవాడని ఆయన సమకాలీనులు చెప్తారు.
భగవంతుని సేవలో తరించిన ధన్యుడు వెంకోబాజీ. ❋

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ. 500/- చొప్పున చెల్లించవచ్చు.
3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలని నిర్ణయించినప్పటికీ నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది.
4. వార్షిక సభ్యత్వం రూ. 100/- పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది.
5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి శారద హైదరాబాద్ పేరున పంపగలరు.
   ఆన్‌లైన్‌లో పంపగోరువారు...శ్రీమతి శారద,
   ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
   **SB A/C NO: 173201000027973.**
   **IFSC CODE: IOBA 0001732.**


**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,**
**బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం. 32,**
**జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500087.**
**ఫోన్: 99595-53218,**
**email: malladisukku@gmail.com,**


# మెహెరాబాద్ అభివృద్ధికై

మెహెరాబాద్ అభివృద్ధికై బాబా ట్రస్టుకు విరాళాలు అందజేయవల్సిందిగా ట్రస్టు చైర్మన్ ఒక ప్రకటనలో కోరారు. డొనేషన్లు ఆన్‌లైన్ బ్యాంకు అక్కౌంటు -Bank of Maharashtra, M.G. Road Br. Ahmednagar (M.S) SB Account No. 20098450037, IFSC code MAHB0000024 ద్వారా ఆన్‌లైన్‌లో పంపవల్సిందిగా కోరుతున్నారు.


Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014**